


ఎన్నికల హామీల అమలుకే పరిమితం కాకుండా ప్రతి కుటుంబం ఆరోగ్యంగా, ఆర్థికంగా బలంగా, సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు సంక్షేమ పథకాలను రూపొందిస్తున్నారు. వేద కుటుంబాలకు భరోసా, భద్రత, మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



శుక్రవారం 27.11.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 | సంచిక - 216 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00



# శ్రీవారికి బంగారు కానుక











**తిరుమల, నవంబరు 26 (జర్నలిస్ట్‌ఫైల్) :** డబ్బు, సంపద, హోదా ఎప్పటికీ శాశ్వతం కాదు.. ఆధ్యాత్మికత, ధర్మం, సేవా భావమే మనిషికి అసలైన సంతృప్తిని, సంతోషాన్ని ఇస్తాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రపంచంలో ఎంతోమంది బిలియనీర్లు, ట్రిలియనీర్లు ఉన్నారని... కానీ సంపాదించిన సంపదను సద్వినియోగం చేసుకునే అదృష్టం కొందరికే దక్కుతుందన్నారు. ఆ కోవలోనే నిలిచి తమ దాతృత్వాన్ని చాటుకున్న చెన్నైకు చెందిన వర్ధమాన్ జైన్, రాధికా జైన్ దంపతులు అందరికీ ఆదర్శంగా ఉన్నారని సీఎం చంద్రబాబు కొనియాడారు. గురువారం తిరుమల శ్రీవారికి చెన్నైకు చెందిన జైన్ దంపతులు రూ.206 కోట్ల విలువైన 121 కిలోల బంగారు, వజ్రాభరణాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సతీసమేతంగా పాల్గొన్నారు. టీటీడీ అర్చకులు, అధికారులు ఈ ఆభరణాలను స్వీకరించారు. అనంతరం ధాతలైన జైన్ దంపతులతో కలిసి సీఎం తిరుమలలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... తిరుమల పవిత్ర క్షేత్రంలో ఒక అపూర్వ ఘట్టం ఆవిష్కృతమైందని, ఇందులో తాను భాగస్వామి కావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ప్రతిరోజూ శ్రీవారికి 120 కిలోల బంగారు ఆభరణాలు అలంకరిస్తారని, దేవుని ఆదేశంతోనే 121 కిలోల బంగారు, వజ్రాభరణాలను సమర్పించామని జైన్ దంపతులు చెప్పడం వారి భక్తికి నిదర్శనమన్నారు. పూర్వం పల్లవ, చోళ, చేర, పాండ్య రాజులతో పాటు మైసూర్, మరాఠా రాజులు ఆలయాన్ని అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణదేవరాయలు శ్రీవారికి రత్నకిరీటం, పీతాంబరం సహా ఎన్నో ఆభరణాలు సమర్పించారని, ఆనాటి శ్రీకృష్ణ దేవరాయల కాలం నుంచి నేటి జైన్ దంపతుల వరకు స్వామివారిపై భక్తి విశ్వాసాలు పెరుగుతూనే ఉన్నాయని ముఖ్యమంత్రి చెప్పారు.

**మానవ సేవే... మాధవ సేవ :** దేవునిపై భక్తి ఉన్న ప్రతి ఒక్కరూ మానవ సేవే – మాధవ సేవ అనే సూత్రాన్ని గుర్తుంచుకోవాలని సీఎం పిలుపునిచ్చారు. సమాజ హితం కోసం పనిచేసే వారే దేవునికి అత్యంత సన్నిహితంగా ఉంటారన్నారు. జైన్ దంపతుల తరహాలోనే ఇతర సంపన్నులు కూడా ముందుకు వచ్చి పేదల సంక్షేమం, సమాజ సేవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందించాలని కోరారు. భక్తులు సమర్పించే ప్రతి రూపాయిని టీటీడీ వారి సౌకర్యాలు, సేవలకే ఖర్చు చేస్తోందన్నారు. రాష్ట్రంలో టీటీడీ సహకారంతో 5 వేల దేవాలయాల నిర్మాణం చేపట్టబోతున్నామని, దేశంలోని అన్ని రాజధానులతో పాటు విదేశాల్లో హిందువులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో శ్రీవారి ఆలయాలు నిర్మిస్తామని వెల్లడించారు. ఆలయం ఉన్న ప్రతిచోటా అన్నప్రసాదం ఏర్పాటు చేస్తామన్నారు. మిగతా 2లో...

- శ్రీవారికి రూ.206 కోట్ల విలువైన బంగారు, వజ్రాభరణాల సమర్పణ
- చెన్నైకి చెందిన జైన్ దంపతుల అపూర్వ దాతృత్వం
- దంపతుల భక్తికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసలు

## బీమా బూటకం కాదు.. గణాంకాలే సాక్ష్యం

- ఖరీఫ్-2026లో 2.3 రెట్లు పెరిగిన నమోదులు
- 17.07 లక్షల హెక్టార్లకు బీమా రక్షణ
- దేశంలో ఆరో స్థానంలో ఆంధ్రప్రదేశ్



**అమరావతి, నవంబర్ 26(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో పంటల బీమా అమలు, ఇన్‌పుట్ సబ్సిడీపై వాస్తవాలను విస్మరించి రైతులను తప్పుదోవ పట్టించేలా వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. రైతులకు ఆర్థిక భద్రత కల్పించడం, ప్రకృతి విపత్తుల సమయంలో ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఖరీఫ్-2025తో పోలిస్తే ఖరీఫ్-2026లో పంటల బీమా నమోదులు 2.3 రెట్లు పెరిగాయని, రాష్ట్రవ్యాప్తంగా 31.01 లక్షల హెక్టార్ల సాగు విస్తీర్ణంలో 17.07 లక్షల హెక్టార్లు, అంటే 55.05 శాతం బీమా పరిధిలోకి వచ్చాయని తెలిపారు. బీమా విస్తీర్ణం పరంగా ఆంధ్రప్రదేశ్ దేశంలో ఆరో స్థానంలో నిలిచిందన్నారు. మిగతా 3లో...

## రాజ్యాంగమే ప్రజాబలం


- ప్రజాస్వామ్యానికి అమూల్య వారసత్వం: మోదీ
- విలువల పరిరక్షణకు పునరంకితం కావాలి

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** భారత ప్రజాస్వామ్యానికి రాజ్యాంగం అమూల్యమైన వారసత్వమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా గురువారం దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌తో పాటు రాజ్యాంగ పరిషత్ సభ్యులకు ఘనంగా నివాళులర్పించారు. రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలను బలోపేతం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. 2047 నాటికి వికసిత భారత్ సాధనలో రాజ్యాంగం నిరంతరం మార్గదర్శకంగా నిలుస్తుందని ఎక్స్ వేదికగా వెల్లడించారు.



భారత రాజ్యాంగం అసాధారణమైనదని, సామాన్య కుటుంబంలో పుట్టిన తనలాంటి వ్యక్తికి ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి నాయకత్వం వహించే అవకాశం కల్పించిందని మోదీ పేర్కొన్నారు. మిగతా 3లో...

## పార్లమెంటు సమావేశాల డేట్ ఫిక్స్




- డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులపై ఉత్కంఠ
- నవంబరు 30న లోక్‌సభ.. డిసెంబరు 2న రాజ్యసభ సమావేశం
- డిసెంబరు 3తో ముగియనున్న ప్రత్యేక భేటీలు
- బిల్లులపై చర్చకు కేంద్ర మంత్రివర్గం సిద్ధం
- 2029 ఎన్నికలే లక్ష్యంగా మోదీ సర్కారు కసరత్తు

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** పార్లమెంటు ప్రత్యేక సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లులను ప్రవేశపెట్టవచ్చనే ఊహాగానాల నేపథ్యంలో ఈ సమావేశాలపై ఆసక్తి నెలకొంది. మిగతా 2లో...

## పోస్టులపై మెటా కొరడా

- భారత్‌లో 54.4 లక్షల పోస్టులు, ఖాతాల తొలగింపు
- ఆరు నెలల్లోనే మెటా భారీ చర్యలు
- ఫేస్‌బుక్‌లో 28 లక్షలు.. ఇన్‌స్టాలో 26 లక్షల కంటెంట్‌పై వేటు




2లో

## కైరో హైవేపై మృత్యుజ్వాలలు

- ఇంధన ట్యాంకర్ ప్రమాదంతో భారీ అగ్నిప్రమాదం
- 31 మంది సజీవ దహనం.. మరో 25 మందికి పైగా గాయాలు
- మంటల్లో 20కి పైగా వాహనాలు దగ్ధం
- గుర్తుపట్టలేనంతగా మృతదేహాలు.. డీఎన్ఏ పరీక్షలు
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం

2లో

## పోలీస్ శాఖలో 1,534 కొలువులు

- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- 378 ఎస్ఐ.. 1,156 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ
- డిసెంబరు 12 సాయంత్రం 5 గంటల వరకు గడువు
- జనవరి 31న కానిస్టేబుల్ పరీక్ష.. ఫిబ్రవరి 28న ఎస్ఐ పరీక్ష



3లో

## 15 వేలకుపైగా కెమెరాలతో ఎన్నికల పోలింగ్ పర్యవేక్షణ

- 23 పట్టణ స్థానిక సంస్థలు, 9,600 గ్రామ పంచాయతీల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు



**విజయవాడ, నవంబర్ 26 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న పట్టణ స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించేందుకు 15 వేలకుపైగా కెమెరాలతో విస్తృత వెబ్‌కాస్టింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు ఈ ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

గురువారం విజయవాడలోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ పర్యవేక్షణ కేంద్రాన్ని కమిషనర్ పరిశీలించారు. వివిధ జిల్లాల నుంచి ప్రత్యక్ష ప్రసారం ద్వారా అందుతున్న పోలింగ్ కేంద్రాల దృశ్యాలను వీక్షిస్తూ పోలింగ్ సరళిని సమీక్షించారు. వెబ్‌కాస్టింగ్ నిర్వహణ, పర్యవేక్షణ ఏర్పాట్ల వివరాలను మీడియాకు వెల్లడించారు. మిగతా 2లో...

## నంది అవార్డుల సందడి మళ్లీ..



- ఎంపిక ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం
- 2017 నుంచి 2025 వరకు అవార్డుల కోసం జ్యూరీల నియామకం..
- వచ్చే నెలలో వేడుకలకు సన్నాహాలు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** తెలుగు సినీ, టెలివిజన్, నాటక రంగాలకు ఎంతో ప్రతిష్టాత్మకమైన నంది అవార్డుల ప్రదానోత్సవాల నిర్వహణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. గత కొన్నేళ్లుగా నిలిచిపోయిన అవార్డుల ఎంపిక ప్రక్రియకు తాజాగా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2017 నుంచి 2025 వరకు వివిధ విభాగాల్లో అవార్డుల ఎంపిక కోసం ప్రత్యేక జ్యూరీ కమిటీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మిగతా 2లో...

## తొలి విడతలో కూటమి జోరు



2 వేలకు పైగా పంచాయతీల్లో తెదేపా మద్దతుదారుల విజయం

జనసేన మద్దతుదారులకు 200కు పైగా స్థానాలు

వైకాపా మద్దతుదారులకు దక్కిన 800 పీఠాలు

రాష్ట్రవ్యాప్తంగా 74.67 శాతం పోలింగ్ నమోదు

3లో

ఏలూరులో అత్యధికంగా 84.83 శాతం.. కడపలో అత్యల్పంగా 59.50 శాతం

## నేడు కేబినెట్ భేటీ



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** నవంబరు 26 : రాష్ట్రంలో భారీ పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన, రాజధాని అమరావతి అభివృద్ధే ప్రధాన అజెండాగా మంత్రిమండలి సమావేశం జరగనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం ఉదయం 10.30 గంటలకు సచివాలయంలో కేబినెట్ భేటీ కానుంది. ఈ సందర్భంగా రూ.88,392 కోట్ల విలువైన పెట్టుబడి ప్రాజెక్టులకు ఆమోదం తెలపడంతో పాటు మిగతా 2లో...

# నంది అవార్డుల సందడి మళ్లీ..



(మొదటి పేజీ తరువాయి)

వచ్చే నెలలో విజయవాడ లేదా అమరావతిలో సినీ, టీవీ, రంగస్థల ప్రముఖుల సమక్షంలో పురస్కారాల వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపడుతోంది.

నంది, జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవాల నిర్వహణ కోసం ప్రభుత్వం అంతర్‌శాఖా కమిటీని ఏర్పాటు చేసింది. ఆంధ్రప్రదేశ్ మేనేజింగ్ డైరెక్టర్ సభ్య కన్వీనర్‌గా వ్యవహరించే ఈ కమిటీలో సమాచార, పౌర సంబంధాల శాఖ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజినీర్, ఏపీ పర్యాటక ప్రాధికార సంస్థ సీఈఓ, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ సభ్యులుగా ఉంటారు. వేడుకల వేదిక ఎంపిక నుంచి కార్యక్రమాల రూపకల్పన, సినీ ప్రముఖులు, అవార్డు గ్రహీతలతో సమన్వయం, సాంకేతిక ఏర్పాట్లు, ఆతిథ్యం, వసతి, రవాణా, భద్రత, ప్రచారం వంటి అంశాలను కమిటీ పర్యవేక్షిస్తుంది. ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థల ఎంపిక, బడ్జెట్ రూపకల్పన బాధ్యతలను కూడా అప్పగించారు.

**గత సంవత్సరాల అవార్డుల ఎంపికకు కమిటీలు:** 2017, 2018 సంవత్సరాల నంది చలనచిత్ర అవార్డుల ఎంపికకు సీనియర్ పాత్రికేయుడు ఎన్. సీతారామరాజు ఛైర్మన్‌గా జ్యూరీని నియమించారు. సంగీత దర్శకురాలు ఎం.ఎం. శ్రీలేఖ, దర్శకుడు వెంకీ, రచయిత రాజేంద్ర కుమార్ పైడిపాటి, పాత్రికేయుడు కంచనపల్లి రామనారాయణ రాజు, డిస్ట్రిబ్యూటర్ అనంత హరిబాబు సభ్యులుగా, ఆంధ్రజ్యోతి ఎండీ సభ్య కన్వీనర్‌గా ఉంటారు.

2019, 2020 సంవత్సరాల అవార్డుల ఎంపికకు దర్శకుడు ఎ. కోదండరామిరెడ్డి నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేశారు. నిర్మాత డి.వి.కె. రాజు, దర్శకుడు చంద్ర సిద్ధార్థ, వనజా ఉదయ్, దర్శకుడు బి.వి.ఎస్. రవి, పాత్రికేయుడు వద్ది ఓంప్రకాశ్ నారాయణ సభ్యులుగా నియమితులయ్యారు.

2021, 2022 సంవత్సరాల అవార్డుల ఎంపిక కమిటీకి సినీ ఎడిటర్ కోటగిరి వెంకటేశ్వరరావును ఛైర్మన్‌గా నియమించారు. సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్, నిర్మాత ఎన్. కృష్ణ ప్రసాద్, దర్శకుడు రాజవన్నెం రెడ్డి, ఆకాశవాణి ప్రతినిధి ఇనంపూడి శ్రీలక్ష్మి, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ డి.ఎస్.ఆర్. వర్మ సభ్యులుగా ఉంటారు.

**2025 చలనచిత్ర అవార్డులకు మూడు జ్యూరీలు:** 2025 నంది చలనచిత్ర అవార్డుల ఎంపిక కోసం మూడు వేర్వేరు కమిటీలను ఏర్పాటు చేశారు. కథా చిత్రాలు, జాతీయ సమైక్యతా చిత్రాలు, బాలల చిత్రాల ఎంపికకు దర్శకుడు బి. గోపాల్ ఛైర్మన్‌గా 11 మంది సభ్యులతో జ్యూరీని నియమించారు. దర్శకుడు వి.ఎన్. ఆదిత్య, ఛాయాగ్రాహకుడు ఎం.వి. రఘు, నటి కళ్యాణి, నృత్యకారిణి బైర్రాజు సంధ్యారాజు, నటుడు మాదాల రవి, దర్శకులు సానా యాదిరెడ్డి, కె. అజయ్ కుమార్, పాత్రికేయుడు వారణాసి లక్ష్మీనారాయణ, ఛాయాగ్రాహకుడు కంద్రు పూర్ణ సభ్యులుగా ఉంటారు.

డాక్యుమెంటరీ, విద్యావిషయక చిత్రాల ఎంపికకు టి. ప్రసన్న కుమార్ ఛైర్మన్‌గా పి.ఎన్. రామచంద్రరావు, ఎం.ఎన్. ప్రసాద్, రాధా రాజేశ్వరి, డి.ఎస్. కన్నన్, కూనిరెడ్డి శ్రీనివాస్ సభ్యులుగా కమిటీని ఏర్పాటు చేశారు. తెలుగు సినిమాపై ఉత్తమ గ్రంథం, విమర్శకుల విభాగానికి రచయిత పరుచూరి గోపాలకృష్ణ ఛైర్మన్‌గా ఎల్. రాంబాబు వర్మ, పామర్తి హేమసుందరరావు సభ్యులుగా మరో జ్యూరీని నియమించారు.

**టెలివిజన్ అవార్డుల ఎంపికకు రెండు కమిటీలు:** 2017 నుంచి 2020 వరకు నంది టీవీ అవార్డుల ఎంపికకు సింగంపల్లి శృతి ఛైర్‌పర్సన్‌గా తొమ్మిది మంది సభ్యులతో జ్యూరీని నియమించారు. మేకల నర్సింగ్ రావు, గుత్తికొండ భార్గవ్, పల్లెమాల సుధాకర్, సర్వేశ్వర్ రెడ్డి, షేక్ అబ్దుల్ కుద్దూస్, సంపత్ మాదగల, చల్లా భాగ్యలక్ష్మి సభ్యులుగా ఉంటారు.

2021 నుంచి 2024 వరకు టీవీ అవార్డుల ఎంపికకు యేటా సత్యనారాయణ ఛైర్మన్‌గా కమిటీ ఏర్పాటు చేశారు. మేకా రామకృష్ణ, శిల్పా, ఆలహరి వెంకట వరప్రసాదరావు, ఎం. ఉదయ్ కుమార్, చిలివేరు వెంకట అప్పారావు (ప్రభంజన్), కె. సత్యనారాయణ (ఈటీవీ), జి. హరిప్రసాద్ సభ్యులుగా నియమితులయ్యారు.

2025 నంది టీవీ అవార్డుల ఎంపికకు కొమ్మనపల్లి గణపతిరావు ఛైర్మన్‌గా 13 మంది సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశారు. రూపాదేవి, కోట శంకరరావు, సుబ్బరాయశర్మ, ఉదయభాను, జి. అనిల్ కుమార్, బి.వి. రమణారావు, ఎ. ప్రసాదరావు, డి.వై. చౌదరి, అనితా చౌదరి, సన, కె.వి.ఎస్. దుర్గ సభ్యులుగా నియమితులయ్యారు.


నంది అవార్డుల ఎంపికకు జ్యూరీల నియామకం, వేడుకల నిర్వహణకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయడంతో తెలుగు కళారంగానికి సంబంధించిన పురస్కార కార్యక్రమాలను పునఃప్రారంభించేందుకు ప్రభుత్వం కార్యాచరణను వేగవంతం చేసింది.

# పోస్టులపై మెటా కొరడా

**బెంగళూరు (జర్నలిస్ట్ ఫైల్)** : సామాజిక మాధ్యమాల్లో భావ ప్రకటనా స్వేచ్ఛపై ఆంక్షలు పెరుగుతున్నాయా? ప్రభుత్వ ఆదేశాలతో పోస్టులు, ఖాతాల తొలగింపు ప్రక్రియ వేగవంతమవుతోందా? మెటా తాజా గణాంకాలు ఈ ప్రశ్నలకు తావిస్తున్నాయి. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ మాతృసంస్థ అయిన మెటా.. 2026 తొలి ఆరు నెలల్లో భారత్‌లో ఏకంగా 54.4 లక్షల పోస్టులు, ఖాతాలపై చర్యలు తీసుకుంది. గతేడాది ద్వితీయార్ధంతో పోలిస్తే ఈ సంఖ్య 131 శాతం పెరిగింది. ప్రపంచవ్యాప్తంగా కంటెంట్ తొలగింపులు స్వల్పంగా తగ్గుతున్నా.. భారత్‌లో మాత్రం భారీగా పెరుగుతుండటం గమనార్హం.

ప్రభుత్వ సంస్థల నుంచి వస్తున్న ఆదేశాలు, చట్టపరమైన నిబంధనల నేపథ్యంలో ఈ తొలగింపులు జరుగుతున్నాయి. ఫిబ్రవరిలో సవరించిన ఐటీ నిబంధనల ప్రకారం.. ప్రభుత్వ ఏజెన్సీలు జారీ చేసే ఆదేశాలపై సామాజిక మాధ్యమ సంస్థలు మూడు గంటల్లోగా స్పందించాల్సి ఉంటుంది. కేంద్ర హోంశాఖకు చెందిన 'సహయోగ్' పోర్టల్ ద్వారా పోలీసులు నేరుగా నోటీసులు పంపే అవకాశం ఏర్పడింది. దీంతో కంటెంట్ తొలగింపు ప్రక్రియ మరింత వేగవంతమైంది.

2026 జులై వరకు అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం.. ఫేస్‌బుక్‌లో సుమారు 28 లక్షలు, ఇన్‌స్టాగ్రామ్‌లో 26 లక్షల కంటెంట్‌పై మెటా నియంత్రణ విధించింది. ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వశాఖ, సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ, ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్, రాష్ట్ర పోలీసు విభాగాల ఆదేశాలతో పాటు స్వయంచాలక వ్యవస్థల ద్వారా ఈ చర్యలు చేపట్టినట్లు సంస్థ వెల్లడించింది.




ప్రపంచవ్యాప్తంగా 2025 ద్వితీయార్ధంలో 2.78 కోట్లుగా ఉన్న కంటెంట్ తొలగింపులు.. 2026 ప్రథమార్ధంలో 2.71 కోట్లకు తగ్గాయి. అదే సమయంలో భారత్‌లో మాత్రం నియంత్రణలు గణనీయంగా పెరిగాయి. ప్రభుత్వ ఒత్తిళ్ల నేపథ్యంలో పబ్లిక్ పోస్టుల తొలగింపు అధికంగా జరుగుతున్న దేశాల్లో భారత్ రెండో స్థానంలో ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. ఇండోనేషియాలో మాత్రమే ఇంతకంటే ఎక్కువగా తొలగింపులు నమోదయ్యాయి.

మెటాకు చెందిన మరో సామాజిక మాధ్యమ వేదిక 'థ్రెడ్స్'లోనూ కంటెంట్ తొలగింపులు పెరిగాయి. 2022 ద్వితీయార్ధంలో కేవలం 1,090గా ఉన్న తొలగింపులు.. 2024, 2025 సంవత్సరాల్లో గణనీయంగా పెరిగి 41,400కు చేరుకున్నాయి. ఒకసారి తొలగించిన కంటెంట్‌కు సంబంధించిన నకళ్లను గుర్తించి వాటినీ స్వయంచాలకంగా తొలగించే వ్యవస్థలు ఈ పెరుగుదలకు ప్రధాన కారణమని మెటా పేర్కొంది.

కంటెంట్ తొలగింపుల వ్యవహారం ఇప్పుడు న్యాయస్థానాలకూ చేరింది. సుప్రీంకోర్టు కార్యకలాపాలకు సంబంధించిన తమ రీల్స్‌ను ఎలాంటి ముందస్తు సమాచారం, కారణం తెలియజేయకుండానే ఇన్‌స్టాగ్రామ్ తొలగిస్తోందని న్యాయ వార్తా పోర్టల్ 'లైవ్‌లా' ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఐటీ నిబంధనల్లోని రూల్ 4(4) కింద చేపడుతున్న స్వయంచాలక కంటెంట్ బ్లాకింగ్‌ను సవాలు చేసింది. ఈ పిటిషన్‌పై 2026 నవంబరు 19న కేంద్రప్రభుత్వం, మెటాకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను 2027 జనవరి 18కి వాయిదా వేసింది.

మీడియా సంస్థల పోస్టుల తొలగింపులు కొనసాగుతుండటంపై డిజిటల్ హక్కుల కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ కారణంతో కంటెంట్‌ను తొలగించారో స్పష్టత ఇవ్వకపోవడం, అప్పీలు చేసుకునే ప్రక్రియలో జాప్యం జరగడం సమస్యగా మారిందని పేర్కొంటున్నారు. క్రిమినల్ కేసులకు సంబంధించిన కీలక తీర్పుల వార్తలు సైతం అల్గారిథమ్ ఆధారిత వ్యవస్థల ద్వారా సామూహికంగా తొలగించబడుతున్న ఘటనలు డిజిటల్ భావ ప్రకటనా స్వేచ్ఛపై ఆందోళనలను పెంచుతున్నాయి.

# నేడు కేబినెట్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

పలు కీలక అభివృద్ధి పనులపై నిర్ణయాలు తీసుకోనున్నారు.

రాష్ట్రానికి వచ్చిన రూ. 88,392 కోట్ల పెట్టుబడులతో కూడిన 18 ప్రాజెక్టులకు మంత్రిమండలి ఆమోదం తెలపనుంది. వీటి ద్వారా 54,210 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో రూ. 19 వేల కోట్లతో కియా పరిశ్రమ విస్తరణకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వనుంది. ఈ విస్తరణతో మరో 12 వేల మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి.

అనకాపల్లి జిల్లా తూటిపాలలో రూ. 47,009 కోట్లతో హైపర్‌స్కేల్ డేటా సెంటర్ నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలపనుంది. రాష్ట్రంలో డిజిటల్ మౌలిక వసతుల విస్తరణకు ఈ ప్రాజెక్టు కీలకం కానుంది.

రాజధాని అమరావతిలో రూ. 1,921 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనులకు మంత్రిమండలి ఆమోదం తెలపనుంది. అమరావతి పరిధిలోని 26 గ్రామాల్లో రూ. 1,215. 70 కోట్లతో రహదారులు, డ్రైయిన్ల నిర్మాణానికి పచ్చజెండా ఊపనుంది. మరో రూ. 80 కోట్లతో పచ్చదనం అభివృద్ధి పనులు చేపట్టనుంది.

రూ. 626. 14 కోట్లతో అమరావతి సంగమం ప్రాజెక్టుకు ఆమోదం తెలిపే అవకాశం ఉంది. రాజధానిలో పబ్లిక్ లైబ్రరీ, ఆడిటోరియం, గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్ భవనాల నిర్మాణాలకూ పచ్చజెండా ఊపనుంది.

రాజధాని ప్రాంతంలోని ఐదు కీలక రహదారుల అభివృద్ధికి ఆసియా మౌలిక సదుపాయాల పెట్టుబడి బ్యాంకు (ఏఐఐబీ) నిధుల వినియోగానికి కేబినెట్ అనుమతించనుంది. ఎల్‌పీఎస్ జోన్-10లో మౌలిక వసతుల కల్పనకు ఏఐఐబీ ఆర్థిక సహకారాన్ని వినియోగించుకునేందుకు ఆమోదం తెలపనుంది. అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్, జంట టవర్ల ద్వారా వచ్చే ఆదాయాన్ని సీఆర్‌డీఏకు మళ్లించే అంశంపైనా నిర్ణయం తీసుకునే అవకాశముంది. ఏపీ క్యాపిటల్ రీజియన్ పరిధిలో భవన నిర్మాణాల ట్రైబ్యునల్ ఏర్పాటుకు కూడా మంత్రిమండలి ఆమోదం తెలపనుంది.

## పెన్షనర్లకు డీఏ బకాయిలు అందేలా చర్యలు తీసుకోవాలి

❍ రాష్ట్ర ఖజానా శాఖ డైరెక్టర్‌కు తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం వినతి

**అమరావతి, నవంబరు 26 (జర్నలిస్ట్ ఫైల్):** 2018 జూలై నుంచి 2021 జూన్ వరకు పెండింగ్‌లో ఉన్నకరువు భత్యం (డీఏ) బకాయిలను పెన్షనర్లకు కూడా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ప్రభుత్వాన్ని కోరింది.

ఈ మేరకు గురువారం రాష్ట్ర ఖజానా శాఖ డైరెక్టర్ కె. పద్మజను సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. డీఏ బకాయిల విడుదలకు సంబంధించి ప్రభుత్వం జీవో నంబర్లు 94, 51 ద్వారా ఉత్తర్వులు జారీ చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు.



అయితే, పెన్షనర్లకు సంబంధించిన వివరాలు ఆన్‌లైన్‌లో అందుబాటులో లేకపోవడంతో డీఏ బకాయిల చెల్లింపు ప్రక్రియలో సమస్యలు ఎదురవుతున్నాయని సంఘం ప్రతినిధులు డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పెన్షనర్లకు కూడా బకాయిలు అందేలా సంబంధిత వివరాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు చెల్లింపుల ప్రక్రియ సజావుగా జరిగేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఖజానా శాఖ డైరెక్టర్ హామీ ఇచ్చినట్లు సంఘం నాయకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు కె. జయరాజు, పి. బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## దేశ హితం, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాజ్యాంగ సవరణలు

**విజయవాడ, నవంబరు 26 (జర్నలిస్ట్ ఫైల్):** భారత రాజ్యాంగ విశిష్టత, ప్రాధాన్యతపై యువతలో విస్తృత అవగాహన కల్పించాలని బీజేపీ రెండు తెలుగు రాష్ట్రాల సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ పిలుపునిచ్చారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సంవిధాన్ దివస్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

'మన సంవిధానం -- మన గౌరవం' నినాదంతో రాజ్యాంగ విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మధుకర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తన పాలనా కాలంలో స్వప్రయోజనాల కోసం రాజ్యాంగ సవరణలు చేసిందని విమర్శించారు. 1975 అత్యవసర పరిస్థితి సమయంలో చేపట్టిన రాజ్యాంగ సవరణలు ఇందిరాగాంధీ ప్రభుత్వ రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగపడ్డాయని ఆరోపించారు. 42వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగ పీఠికలో 'లౌకికవాదం', 'సామ్యవాదం' పదాలను చేర్చడాన్నికూడా ఆయన ప్రస్తావించారు. వాజ్‌పేయీ, నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వాలు చేపట్టిన రాజ్యాంగ సవరణలు దేశ సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని చేసినవేనని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఉజ్వల గ్యాస్ పథకం, డిజిటల్ చెల్లింపుల




వంటి కార్యక్రమాలు సమానత్వం, ప్రజా సంక్షేమ లక్ష్యాలకు అనుగుణంగా అమలవుతున్నాయని వివరించారు. పేదరిక నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ప్రస్తావిస్తూ ప్రపంచ బ్యాంకు నివేదికలో పేర్కొన్న అంశాలను గుర్తుచేశారు.

ప్రతి పౌరుడు, బీజేపీ కార్యకర్త తమ ఇళ్లలో తెలుగు రాజ్యాంగ ప్రతిని ఉంచుకోవాలని, రాజ్యాంగ మూల సూత్రాలు, సవరణలపై అవగాహన పెంపొందించుకుని సమాజానికి తెలియజేయాలని మధుకర్ కోరారు.

ఈ కార్యక్రమంలో ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు ఉప్పలపాటి శ్రీనివాస్ రాజు మాట్లాడుతూ రాజ్యాంగం పట్ల కాంగ్రెస్ పార్టీకి గౌరవం లేదని విమర్శించారు. రాజ్యాంగ విలువలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ, జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముప్పల సుబ్బయ్య, కార్పొరేటర్ బొమ్మదేవర రత్నకుమారి, బీఎన్‌కే పట్నాయక్, జర్పుల పార్వతి, దాసరి రవికుమార్, పైలా సురేష్, తరుణ్ కాకాని, మాదాల రమేష్, శ్రీనివాస్, దామోదర్, ప్రవీణ్ రాంక్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారికి బంగారు కానుక




(మొదటి పేజీ తరువాయి)

అలాగే, 'ప్రాణదానం' ద్వారా వైద్య సేవలు, 'విద్యాదానం' కింద ప్రత్యేక నిధితో యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తామని తెలిపారు. ఎల్‌నినో వంటి ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు రాష్ట్రవ్యాప్తంగా 'వృక్షో గోవిందం' పేరుతో పచ్చదనం పెంపు కార్యక్రమాలు చేపడతామన్నారు. భవిష్యత్తులో తిరుమలకు నీటి ఎద్దడి అనే మాటే లేకుండా హంద్రీ-నీవా ద్వారా కళ్యాణి డ్యాంకు, సోమశిల ద్వారా బాలాజీ రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తామని, అవసరమైతే తిరుమలకు రెండో పైప్ లైన్ కూడా వేస్తామని స్పష్టం చేశారు. టెక్నాలజీ, నాలెడ్జ్‌తో పాటు భగవంతుని కృప ఉండటం వల్లే రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని, శ్రీవారి ఆశీస్సులతో రాష్ట్రం, దేశం మరింత అభివృద్ధి చెందడం ఖాయమని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

**నమ్ముకున్న వారికి శ్రీవారి అండ... రక్షణ :** పూర్వ కాలంలో దేవాలయాల మీద చాలా దాడులు జరిగాయి... కానీ వెంకటేశ్వరస్వామి దేవాలయం విషయంలో ఎవ్వరూ ఆ సాహసానికి ఒడిగట్టలేదని ముఖ్యమంత్రి అన్నారు. రోజు రోజుకూ శ్రీవారి భక్తుల విశ్వాసాన్ని పెంపొందించడానికి చాలా మంది కృషి చేశారని చెప్పారు. కొలిచిన వారికి, నమ్మిన వారికి శ్రీవారు రక్షణగా నిలిచారని... అది తన విషయంలో నిరూపితమైందన్నారు. ప్రాణదానం కార్యక్రమాన్ని ప్రారంభించిన రోజే నాపై అలిపిరిలో దాడి జరిగిందని... చాలా పకడ్బందీగా నాపై దాడి జరిగినా... స్వామి కృప వల్లే ఆ దాడిలో ఎవ్వరూ చనిపోలేదని చెప్పారు. వెంకటేశ్వర స్వామే ప్రాణభిక్ష పెట్టారని... పునర్జన్మనిచ్చారంటూ సీఎం భావోద్వేగంతో నాటి సంఘటనను గుర్తుచేసుకున్నారు. ప్రపంచం మొత్తంగా ఉన్న శ్రీవారి భక్తుల్లో విశ్వాసం పెంపొందించేలా కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. భక్తుల విరాళాలు, ఆదాయాన్ని వెల్లడించడం, భక్తులు ఇచ్చిన విరాళాలను వారి సౌకర్యాలు.. సేవలకే ఖర్చు పెడుతున్నారని తెలిపారు. తిరుమల కొండపై పచ్చదనం విరాజిల్లుతోందని... దేవుని పవిత్రత కాపాడే విషయంలో రాజీ పడవద్దని టీటీడీకి విజ్ఞప్తి చేశారు. గో-సంరక్షణ, వేద పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని... దీనికి టీటీడీ నాందీ పలకాలన్నారు. శ్రీవారి దేవాలయాన్ని ఆదర్శంగా... పవిత్రతకు మారుపేరుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి సూచించారు. శ్రీవారి సేవకులు చాలా భక్తివిశ్వాసంతో సేవలు అందిస్తున్నారని... వారిని మరింత ప్రోత్సహించాలన్నారు. ఎక్కడికక్కడ శ్రీవారి దేవాలయాలను నిర్మించాలి... ఆ దేవాలయాల్లో ప్రశాంత, పవిత్ర వాతావరణం ఉండేలా చూడాలని నిర్దేశించారు. దేశంలోని అన్ని రాజధానుల్లో శ్రీవారి దేవాలయాలను నిర్మిస్తామని... విదేశాల్లో కూడా హిందువులు ఎక్కువగా ఉన్న చోట వెంకటేశ్వర స్వామి దేవాలయాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. మీడియా సమావేశంలో టీటీడీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పార్లమెంటు సమావేశాల డేట్ ఫిక్స్



(మొదటి పేజీ తరువాయి)

నవంబరు 30న లోక్‌సభ, డిసెంబరు 2న రాజ్యసభ సమావేశం కానున్నాయి. డిసెంబరు 3తో ప్రత్యేక భేటీలు ముగిసే అవకాశముందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్‌ను కోరినట్లు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఎక్స్ వేదికగా తెలిపారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో కేంద్ర మంత్రివర్గం శుక్రవారం భేటీ కానుంది. ఈ సందర్భంగా డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులపై చర్చించే అవకాశముందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అయితే ఈ సమావేశాల్లో ఏయే బిల్లులను ప్రవేశపెడతారనే విషయాన్ని ప్రభుత్వం అధికారికంగా వెల్లడించలేదు. దీంతో రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. పార్లమెంటు ఉభయ సభలు ఆగస్టు 13న నిరవధికంగా వాయిదా పడ్డాయి. అయినప్పటికీ ఇప్పటివరకు పార్లమెంటును ప్రొరోగ్ చేయలేదు. సాధారణంగా నిరవధిక వాయిదా అనంతరం సభలను ప్రొరోగ్ చేస్తారు. అయితే ఈసారి 100 రోజులు దాటినా ఆ ప్రక్రియ పూర్తికాకపోవడం ప్రత్యేకతగా నిలిచింది.

2029 సార్వత్రిక ఎన్నికలకు ముందే పార్లమెంటు, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అదే సమయంలో డీలిమిటేషన్ ద్వారా లోక్‌సభ స్థానాల సంఖ్యను ప్రస్తుత 543 నుంచి గరిష్ఠంగా 850కి పెంచాలని భావిస్తోంది. ఇందుకోసం అవసరమైన రాజకీయ మద్దతును కూడగట్టేందుకు ప్రయత్నిస్తోంది.

ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో రాజ్యాంగ 131వ సవరణ బిల్లు, డీలిమిటేషన్ బిల్లు-2026లను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయితే అవసరమైన సంఖ్యాబలం లేకపోవడంతో ఆ బిల్లులు ఆమోదం పొందలేదు. ఈ నేపథ్యంలో మరోసారి విపక్ష పార్టీలతో పాటు ఇతర పార్టీల మద్దతు కూడగట్టి బిల్లులను గట్టెక్కించాలని కేంద్రం యోచిస్తోంది. తాజా ప్రత్యేక సమావేశాల్లో ఈ అంశాలపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.

## కైరో హైవేపై మృత్యుజ్వాలలు

**కైరో:** ఈజిప్ట్ రాజధాని కైరో సమీపంలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఇంధన ట్యాంకర్ ప్రమాదానికి గురై చెలరేగిన మంటలు క్షణాల్లో ఇతర వాహనాలకు వ్యాపించడంతో 31 మంది సజీవ దహనమయ్యారు. మరో 25 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం రాత్రి కైరో రింగ్ రోడ్డుపై జరిగిన ఈ దుర్ఘటనలో 20కి పైగా కార్లు, మోటార్ సైకిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి.

గ్రేటర్ కైరో పరిధిలోని గిజా ప్రావిన్స్‌లో జనసాంద్రత అధికంగా ఉండే ఇంబాబా సమీపంలోని వరాక్ జిల్లాలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఇంధన ట్యాంకర్ ఢీకొన్న వెంటనే భారీగా మంటలు చెలరేగాయి. దీంతో వాహనాల్లో ఉన్నవారు బయటపడే అవకాశం లేక ప్రాణాలు కోల్పోయారు. మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోవడంతో వారి వివరాలను నిర్ధారించేందుకు డీఎన్ఏ పరీక్షలు చేపట్టినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్యాలయం వెల్లడించింది. ప్రమాదంలో గాయపడిన పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆరోగ్య శాఖ మంత్రి ఖలీద్ అబ్దుల్ గఫార్ తెలిపారు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఘటనపై ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫత్తాహ్ ఎల్-సిసి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదానికి కారణాలను గుర్తించేందుకు సమగ్ర దర్యాప్తునకు అధికారులు ఆదేశించారు. ఈజిప్ట్‌లో రహదారి భద్రతా ప్రమాణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఏటా వేలాది మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ ఏడాది జనవరిలో దక్షిణ ప్రావిన్స్ బెని సూయిఫ్ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 21 మంది మరణించగా.. మరో 16 మంది గాయపడ్డారు.

## 15 వేలకుపైగా కెమెరాలతో ఎన్నికల పోలింగ్ పర్యవేక్షణ



(మొదటి పేజీ తరువాయి)

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల కోసం సుమారు 5,600 కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సుమారు 9,500 గ్రామ పంచాయతీల పరిధిలో వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశామని వివరించారు. మొత్తం 23 పట్టణ స్థానిక సంస్థలు, 9,600 గ్రామ పంచాయతీల్లో పోలింగ్ సరళిని పర్యవేక్షించేందుకు వ్యవస్థను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కెమెరాల ప్రత్యక్ష ప్రసారాలను రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలోని ప్రత్యేక పర్యవేక్షణ కేంద్రానికి అనుసంధానించారు. అక్కడి నుంచి వివిధ జిల్లాల్లో పోలింగ్ జరుగుతున్న తీరును నిరంతరం పరిశీలించడంతో పాటు, దృశ్యాలను రికార్డు చేసే ఏర్పాట్లు కూడా చేసినట్లు తెలిపారు. కెమెరాలు నిరంతరాయంగా పనిచేసేలా సాంకేతిక ఏర్పాట్లు చేపట్టామని, ఏదైనా పోలింగ్ కేంద్రంలో సమస్యలు లేదా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటే వాటిని వెంటనే గుర్తించి సంబంధిత జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ఎన్నికల అధికారుల ద్వారా చర్యలు తీసుకునేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందని కమిషనర్ వివరించారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాల్లో పరిస్థితులను 

## ఐటీఐ కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, ఓపీఎస్ మార్గదర్శకాల సమస్యలపై ఫైనాన్స్ శాఖకు వినతి



- ఎయిడెడ్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను ప్రస్తావించిన ఏపీజేఏసీ, ఏపీఎన్జీజీఓ నాయకులు

**విజయవాడ, నవంబర్ 25(జర్నలిస్ట్ ఫైల్):** ఐటీఐ కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, జీవో 53 ప్రకారం ఓపీఎస్ పరిధిలోకి రావాల్సిన ఉద్యోగులకు సంబంధించిన మార్గదర్శకాలలో నెలకొన్న సాంకేతిక సమస్యలు, ఎయిడెడ్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఏపీజేఏసీ, ఏపీఎన్జీజీఓ సంఘం నాయకులు కోరారు.

ఈ మేరకు వెలగపూడి సచివాలయంలో ఫైనాన్స్ శాఖ జాయింట్ సెక్రటరీ గౌతమ్ అల్లాడను నవంబర్ 25న ఏపీఎన్జీజీఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీజేఏసీ చైర్మన్ ఎ. విద్యాసాగర్, ఏపీజేఏసీ సెక్రటరీ జనరల్ కె.కె.ఎస్.ఎస్. ప్రసాద్, ఎన్జీజీఓ ప్రధాన కార్యదర్శి డి.వి. రమణ కలిసి ఉద్యోగుల సమస్యలను వివరించారు.

ఐటీఐ కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ అంశంపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, జీవో 53 ప్రకారం ఓపీఎస్‌లోకి రావాల్సిన ఉద్యోగులకు సంబంధించి అమలులో ఉన్న మార్గదర్శకాలలో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులను పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా ఎయిడెడ్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ప్రస్తావించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో ఏపీఎన్జీజీఓ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎల్. రజనీష్ బాబు, క్యాపిటల్ సిటీ యూనిట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సి. హెచ్. శ్రీధర్, గ్రామ, వార్డు సచివాలయాల ప్రధాన కార్యదర్శి బి. అంకమ్మరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

## రాజ్యాంగమే ప్రజాబలం

(మొదటి పేజీ తరువాయి)

కోట్లాది భారతీయుల జీవితాల్లో రాజ్యాంగం అంతర్భాగమని తెలిపారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా వివిధ పత్రికల్లో ప్రచురితమైన వ్యాసంలో ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగ నిర్మాతలను స్మరించుకోవడంతో పాటు అందులోని మౌలిక విలువలను కాపాడుకోవాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ఉన్నవారే గతంలో దాన్ని బలహీనపరిచారని కాంగ్రెస్ పార్టీని ఉద్దేశించి మోదీ విమర్శించారు. దాదాపు ఐదు దశాబ్దాల పాటు దేశాన్ని పాలించినవారు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించారని ఆరోపించారు. 1951లో చేపట్టిన తొలి రాజ్యాంగ సవరణకు ఈ ఏడాదితో 75 ఏళ్లు పూర్తవుతున్నాయని గుర్తుచేశారు. తొలి సార్వత్రిక ఎన్నికలకు కొన్ని నెలల ముందే తాత్కాలిక పార్లమెంటులో మెజారిటీని ఉపయోగించి ప్రాథమిక స్వేచ్ఛలపై పరిమితులు విధించారని పేర్కొన్నారు.

అత్యవసర పరిస్థితుల సమయంలో తీసుకొచ్చిన 42వ రాజ్యాంగ సవరణ న్యాయ సమీక్ష అధికారాలను కుదించి, వ్యవస్థల మధ్య అధికార సమతౌల్యాన్ని దెబ్బతీసిందని విమర్శించారు. అధికార దాహంతో వ్యవహరించే నాయకత్వం ఎలాంటి చర్యలకు పాల్పడగలదో తెలుసుకునేందుకు 38, 39వ రాజ్యాంగ సవరణలను యువత అధ్యయనం చేయాలని సూచించారు.

జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370, 35ఏ నిబంధనలపైనా ప్రధాని ప్రస్తావించారు. వాటి కారణంగా ఏడు దశాబ్దాలకు పైగా అక్కడ భారత రాజ్యాంగం పూర్తి స్థాయిలో అమలుకాలేదని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలు, మహిళల హక్కులకు విఘాతం కలిగిందని ఆరోపించారు. 2019లో ఆర్టికల్ 370, 35ఏ రద్దుతో చారిత్రక తప్పిదాన్ని సరిదిద్దామని తెలిపారు.

2047 నాటికి వికసిత భారత్ సాధించే దిశగా దేశం కీలక దశలో ఉందని మోదీ పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధనకు రెండు సూత్రాలు మార్గదర్శకంగా ఉండాలని సూచించారు. ఆలోచనల్లో 'ఇండియా ఫస్ట్' (భారత్ ప్రథమం), కార్యాచరణలో 'కర్తవ్య' (బాధ్యత) ఉండాలని స్పష్టం చేశారు. ఈ సూత్రాలను ఆచరిస్తూ రాజ్యాంగాన్ని మరింత బలోపేతం చేస్తే భావితరాలకు ఉజ్వలమైన దేశాన్ని అందించగలమని తన వ్యాసంలో పేర్కొన్నారు.

## తొలి విడతలో కూటమి జోరు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** గ్రామ పంచాయతీ ఎన్నికల తొలి విడతలో కూటమి హవా కొనసాగింది. పల్లెపోరులో తెదేపా మద్దతుదారులు అత్యధిక స్థానాల్లో విజయం సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా తొలివిడతలో 3,949 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించగా.. కడపటి వార్తలు అందేసరికి తెదేపా మద్దతుదారులు 2,000కు పైగా స్థానాలను కైవసం చేసుకున్నారు. జనసేన మద్దతుదారులు 200కు పైగా పంచాయతీల్లో గెలుపొందగా.. వైకాపా మద్దతుదారులు సుమారు 800 స్థానాల్లో విజయం సాధించారు. పలుచోట్ల స్వతంత్రులు, ఇతరులు కూడా సర్పంచి పీఠాలను దక్కించుకున్నారు.

పల్లెల్లో ప్రజాస్వామ్య పండుగకు ఓటర్లు పోటెత్తారు. గ్రామ పంచాయతీ ఎన్నికల తొలి విడతలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గురువారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం ఒంటిగంటకు ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 74.67 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలవారీగా చూస్తే ఏలూరు 84.83 శాతంతో అగ్రస్థానంలో నిలవగా.. వైఎస్సార్ కడప జిల్లా 59.50 శాతంతో చివరి స్థానంలో నిలిచింది. ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు, ఉపాధి కోసం వెళ్లినవారు సైతం స్వగ్రామాలకు చేరుకుని ఓటు వేశారు. మరోవైపు 23 పట్టణ స్థానిక సంస్థల్లోనూ పోలింగ్ చురుగ్గా సాగినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా వెల్లడించారు.

ఎన్నికల్లో ఓటర్ల నుంచి విశేష స్పందన కనిపించిందని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ తెలిపారు. చెన్నైలో పనిచేస్తున్న ఓ మహిళా ఐటీ ఉద్యోగిని ప్రత్యేకంగా స్వగ్రామానికి వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవడం అభినందనీయమన్నారు. ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు సైతం గ్రామాలకు చేరుకుని ఓటు వేస్తున్నారని చెప్పారు. ప్రజాస్వామ్య ప్రక్రియపై ప్రజల్లో పెరిగిన ఆసక్తి, బాధ్యతకు ఇది నిదర్శనమన్నారు. గత జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో సుమారు 60 శాతం పోలింగ్ నమోదుకాగా.. ఈసారి దాదాపు 74 శాతానికి చేరిందని, గతంతో పోలిస్తే 14 శాతం పెరుగుదల కనిపించిందని వివరించారు.

ఎన్నికల నిర్వహణ తీరును పరిశీలించేందుకు అనిల్ చంద్ర పునేఠా తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని కానూరు రవీంద్రభారతి పాఠశాల, ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని విజ్ఞాన విహార్ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఓటర్లు, పోలింగ్ ఏజెంట్లు, ప్రిసైడింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బందితో మాట్లాడి ఏర్పాట్లు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు, ఫిర్యాదులు లేవని వారు తెలిపినట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా అందుతున్న సమాచారం ప్రకారం ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని చెప్పారు. ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా జరిగేలా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని కమిషనర్ తెలిపారు. అవసరమైన చోట అదనపు పోలీసు బలగాలను మోహరించి పరిస్థితిని అదుపులో ఉంచాలని అధికారులకు సూచించినట్లు చెప్పారు.

# ప్రపంచ స్ట్రోక్ డే సందర్భంగా ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ప్రపంచ స్ట్రోక్ డే సందర్భంగా ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్, గుంటూరు ఆధ్వర్యంలో పక్షవాతం (స్ట్రోక్) నివారణ, ముందస్తు గుర్తింపు మరియు సకాలంలో వైద్య చికిత్సపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గురువారం అవగాహన ర్యాలీని ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్లమెంట్ సభ్యులు భాష్యం రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన స్ట్రోక్‌పై ప్రజల్లో అవగాహన పెంపొందించడం ఎంతో అవసరమని, పక్షవాతం లక్షణాలను ముందుగానే గుర్తించి సకాలంలో వైద్య చికిత్స పొందడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్ బాబు గారు, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాయపాటి మమత, న్యూరాలజిస్టులు డాక్టర్ కుమారవేల్, డాక్టర్ మీనా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ పోతినేని రమేష్ బాబు మాట్లాడుతూ, స్ట్రోక్ చికిత్సలో గోల్డెన్ అవర్ప్రాముఖ్యతను వివరించారు. స్ట్రోక్ వచ్చినప్పుడు ప్రతి నిమిషం ఎంతో విలువైనదని, తొలి గంటల్లో అందించే వైద్యం రోగి ప్రాణాలను కాపాడటంలో, పక్షవాతం వల్ల కలిగే శాశ్వత



వైకల్యాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ముఖం ఒకవైపు వాలిపోవడం, చేతులు లేదా కాళ్లలో అకస్మాత్తుగా బలహీనత ఏర్పడటం, మాట తడబడటం వంటి లక్షణాలు కనిపించిన వెంటనే ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి చేరుకోవాలని సూచించారు.

అలాగే ప్రపంచ స్ట్రోక్ డే సందర్భంగా స్ట్రోక్ నివారణ, ముందస్తు లక్షణాల గుర్తింపు, తక్షణ వైద్య సహాయం మరియు ఆరోగ్యకరమైన జీవనశైలి పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన ఆవశ్యకతను వివరించారు.

ఈ సందర్భంగా వైద్య నిపుణులు మాట్లాడుతూ, అధిక రక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, ధూమపానం వంటి అంశాలు స్ట్రోక్ ముప్పును పెంచుతాయని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని



సూచించారు.

ప్రజల్లో ఆరోగ్యచైతన్యం పెంపొందించడం, స్ట్రోక్ నివారణ, ముందస్తు గుర్తింపు మరియు అత్యవసర వైద్య చికిత్స ప్రాముఖ్యతను తెలియజేయడం లక్ష్యంగా ఈ అవగాహన ర్యాలీని నిర్వహించినట్లు ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ప్రతినిధులు తెలిపారు.

## బీమా బూటకం కాదు.. గణాంకాలే సాక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

బీమా దరఖాస్తులు 18.88 లక్షల నుంచి 44.09 లక్షలకు, బీమా పొందిన రైతుల సంఖ్య 7.43 లక్షల నుంచి 17.10 లక్షలకు పెరిగిందని వివరించారు. స్వచ్ఛంద నమోదు విధానానికి రైతుల నుంచి లభిస్తున్న స్పందనకు ఈ గణాంకాలే నిదర్శనమని పేర్కొన్నారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పంటల బీమా ప్రీమియం బకాయిలు పేరుకుపోవడం వల్ల రైతులకు పరిహారం అందడంలో సమస్యలు తలెత్తాయని మంత్రి తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చించి పెండింగ్ ప్రీమియం బకాయిలను విడతలవారీగా చెల్లించే కార్యాచరణకు ఆమోదం సాధించామని చెప్పారు. 2026-27లో రూ.500కోట్లు, 2027-28లో రూ.1,000 కోట్లు, 2028-29లో రూ.1,500 కోట్లు చొప్పున మొత్తం రూ.3,000 కోట్ల చెల్లింపులకు కేంద్ర వ్యవసాయ శాఖ ఆమోదం తెలిపిందన్నారు. రాష్ట్ర వాటా అందిన వెంటనే పెండింగ్ క్లెయిమ్‌లను పరిష్కరించాలని బీమా కంపెనీలకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. రబీ 2022-23 నుంచి ఖరీఫ్-2025 వరకు పెండింగ్ రాష్ట్ర వాటా చెల్లింపుల కోసం ప్రతిపాదనలు సమర్పించామని, ఇప్పటికే రూ.500 కోట్లలో రూ.250 కోట్లు బీమా కంపెనీలకు చెల్లించామని వెల్లడించారు. ఖరీఫ్--2026 నుంచి ప్రత్యేక ఎస్క్రో ఖాతా విధానాన్ని అమలు చేస్తూ మరో రూ.250 కోట్లు జమ చేశామని, అందులో నుంచి ఖరీఫ్, రబీ సీజన్లకు అడ్వాన్స్ ప్రీమియం చెల్లింపులు చేపట్టామని వివరించారు.

పంటల బీమా విధానంలో మార్పులు మంత్రివర్గ ఉపసంఘం సిఫారసుల మేరకు చేపట్టామని అచ్చెన్నాయుడు తెలిపారు. రబీ 2024-25 నుంచి రైతుల భాగస్వామ్యంతో స్వచ్ఛంద నమోదు విధానాన్ని అమలు చేస్తున్నామని, కేంద్ర ప్రభుత్వ



నిబంధనల ప్రకారం ఖరీఫ్ పంటలకు రైతుల ప్రీమియం వాటా గరిష్ఠంగా 2 శాతం, రబీ పంటలకు 1.5 శాతం, వార్షిక వాణిజ్య, ఉద్యాన పంటలకు 5 శాతం మాత్రమేనని పేర్కొన్నారు. మిగిలిన ప్రీమియం సబ్సిడీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తున్నాయని తెలిపారు. ప్రకృతి విపత్తుల కారణంగా 2024 జూలై, ఆగస్టు--సెప్టెంబర్, 2025 మార్చిలో నష్టపోయిన 2.07 లక్షల మంది రైతులకు రూ.310.30 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ అందించామని చెప్పారు. వరి, పత్తి, వేరుశనగ, చెరకు పంటలకు హెక్టారుకు సబ్సిడీని రూ.17,000 నుంచి రూ.25,000కు పెంచగా, ఇతర ఎంపిక చేసిన పంటలకు రూ.15,000 చొప్పున రాష్ట్ర సహాయ రేటు వర్తిస్తుందని తెలిపారు. బీమా ఉన్నా లేకపోయినా 33 శాతం లేదా అంతకంటే ఎక్కువ పంట నష్టం నమోదైన రైతులకు నిబంధనల ప్రకారం ఇన్‌పుట్ సబ్సిడీ అందుతుందని స్పష్టం చేశారు.

ఖరీఫ్-2026లో కరువు, అర్ణబ్, మురాసు తుఫాన్లు, సెప్టెంబర్ వరదలు, భారీ వర్షాల కారణంగా 14.59 లక్షల మంది రైతులకు చెందిన 12.06 లక్షల హెక్టార్లలో పంట నష్టం నమోదైందని మంత్రి వెల్లడించారు. పెంచిన రాష్ట్ర సహాయ రేట్ల ప్రకారం రూ.2,532.89 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ అవసరమని అంచనా వేసినట్లు తెలిపారు. కరువు కారణంగా 20 జిల్లాల్లో 9.87 లక్షల మంది రైతులకు చెందిన 9.30 లక్షల హెక్టార్లలో నష్టం నమోదైందని, అర్ణబ్ తుఫాను, మురాసు తుఫాను, వరదలు, భారీ వర్షాల వల్ల కూడా వేలాది మంది రైతులు నష్టపోయారని వివరించారు. క్షేత్రస్థాయి ఎన్యూమరేషన్ ఆధారంగా సమర్పించిన ఇన్‌పుట్ సబ్సిడీ ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని, అర్హులైన రైతులకు నిబంధనల ప్రకారం సహాయం అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. పంట కోత ప్రయోగాలు (జజజుం), యెస్-టెక్ ఆధారిత దిగుబడి అంచనాల ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేసి బీమా పరిహారం అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

రబీ 2026-27 సీజన్‌లో రైతులు తమ పంటలకు బీమా రక్షణ కల్పించుకోవాలని మంత్రి సూచించారు. వరి, మామిడి పంటలకు డిసెంబర్ 31లోగా, ఇతర నోటిఫై చేసిన పంటలకు డిసెంబర్ 15లోగా బ్యాంకులు, కామన్ సర్వీస్ సెంటర్లు, మీ--సేవ కేంద్రాల ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు. సందేహాల నివృత్తికి కిసాన్ కాల్ సెంటర్ 1800-180-1551 లేదా హెల్ప్‌లైన్ 155251ను సంప్రదించవచ్చని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, గత ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకుని రైతుల సంక్షేమంపై అపోహలు సృష్టించడం సరికాదని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## 'రీ ఇమాజినింగ్ పబ్లిక్ ఫైనాన్స్' పేరిట రాష్ట్ర ప్రభుత్వ సదస్సు

**అమరావతి :** రాష్ట్రంలో మరింత వేగంగా ఆర్థిక సంస్కరణలను అమలు చేయడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీనిలో భాగంగా ప్రజా ఆర్థిక నిర్వహణలో సరికొత్త విధానాలు, ప్రత్యామ్నాయ ఆర్థిక వనరుల సమీకరణ కోసమంటూ విజయవాడలో రెండు రోజుల పాటు సదస్సు నిర్వహించనుంది. 'రీ ఇమాజినింగ్ పబ్లిక్ ఫైనాన్స్' పేరిట డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళావేదికలో డిసెంబర్ రెండు, మూడు తేదీల్లో ఈ సదస్సును నిర్వహించనున్నారు. రాష్ట్ర ఆర్థిక శాఖ నిర్వహించనున్న ఈ సదస్సులో రాష్ట్ర స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రభుత్వ యంత్రాంగాన్ని భాగస్వామ్యం చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుండి ఇప్పటికే ఆదేశాలు జారీ అయ్యాయి . దేశంలో ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థ వేగంగా మారుతున్న నేపథ్యంలో ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు సావరిన్ వెల్త్ ఫండ్స్, సంస్థాగత పెట్టుబడి నిధులు, క్యాపిటల్ మార్కెట్లు, గ్రీన్ ఫైనాన్స్, కార్బన్ ఫైనాన్స్, విదేశీ వాణిజ్య రుణాలు, ప్రభుత్వ ఆస్తులను అమ్మడం (నగదీకరణ) వంటి ప్రత్యామ్నాయ మార్గాలు ప్రాధాన్యత సంతరించుకుంటుఆన్నయని ఆర్థిక శాఖ అధికారులు గురువారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్రాలు సంప్రదాయ ఆర్థిక వనరులతో పాటు ఈ కొత్త మార్గాల ద్వారా కూడా నిధులు సమీకరించుకోవల్సి ఉందని, ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు ఆ దిశలో ప్రయత్నాలు చేస్తున్నాయని ఆ ఉత్తర్వుల్లో తెలిపారు. సమయంలో కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ, తదుపరి తరం ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య (నెక్స్ట్ జనరేషన్ పిపిపి ) విధానాల ద్వారా మౌలిక సదుపాయాల అభివృద్ధికి కొత్త మార్గాలపై కూడా ఈ సదస్సులో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి వివిధ రాష్ట్రాల ఆర్థిక శాఖ కార్యదర్శులు, ఉన్నతాధికారులు, ఆర్థిక సంస్థలు, సావరిన్ వెల్త్ ఫండ్స్, పెన్షన్ ఫండ్స్, బ్యాంకులు, రేటింగ్ సంస్థలు, టెక్నాలజీ, ఫిన్‌టెక్ కంపెనీలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థల ప్రతినిధులు హాజరుకానున్నారు. వివిధ అంశాలపై నిర్వహించే సమావేశాలు, ప్యానెల్ చర్చలు రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా కలెక్టర్లకు కీలకమైన అవగాహన, అభ్యాస అవకాశాలను కల్పించనున్నారు. ఈ సదస్సులో పాల్గొనాల్సిం దిగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, శాఖాధిపతులు, రాష్ట్ర ప్రభుత్వ కార్పొరేషన్ల మేనేజింగ్ డైరెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొననున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయిన జిల్లాల కలెక్టర్లను కూడా ఆహ్వానించారు. ప్రజా ఆర్థిక వ్యవస్థలో ఆధునిక విధానాలపై అవగాహన పెంపొందించు కోవడంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన కొత్త ఆర్థిక మార్గాలను అన్వేషించేందుకు ఈ సదస్సు వేదిక కానున్నట్టు ఆర్థికశాఖ పేర్కొంది.

## అమ్మకానికి బిఎస్ఎన్ఎల్ ఆస్తులు

**న్యూఢిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన భూములు, భవనాలు, ఇతర ఆస్తుల విక్రయాన్ని మోదీ సర్కార్ మరింత వేగవంతం చేస్తోంది. తాజాగా టెలికం కంపెనీలు బిఎస్ఎన్ఎల్, ఎంటిఎన్ఎల్‌లకు సంబంధించిన రూ.1300 కోట్ల విలువ చేసే ఆస్తులను ప్రయివేటు, కార్పొరేట్ శక్తులకు విక్రయించడానికి సన్నద్ధం అవుతోంది. ఈ ప్రతిపాదనలను తాజాగా నేషనల్ ల్యాండ్ మానిటైజేషన్ కార్పొరేషన్ (ఎన్ఎల్ఎంసి) పరిశీలించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2026-27లో ఇప్పటికే రూ.9 వేల కోట్లకు పైగా ప్రభుత్వ రంగ ఆస్తులను విక్రయించి.. ఆ మొత్తాన్ని ఖజానాలో వేసుకున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ వెల్లడించింది. బిఎస్ఎన్ఎల్, ఎంటిఎన్ఎల్‌కు చెందిన ఆస్తుల నగదీకరణ ప్రతిపాదనలను బుధవారం జరిగిన ఎన్ఎల్ఎంసి 22వ బోర్డు సమావేశం




పరిశీలించిందని అధికార వర్గాలు తెలిపాయి. సుమారు రూ.1,300 కోట్ల విలువైన ఈ ప్రతిపాదనలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం తదుపరి ప్రక్రియకు తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నాయి. మరోవైపు ఎన్‌టిఎన్ఎల్ ఆధీనంలోని ఢిల్లీ, ముంబయిలో ఉన్న 17 నివాస ఆస్తుల విలువ నిర్ధారణ నివేదికలను కూడా బోర్డు పరిశీలించిందన్నారు. గతంలో ప్రయాగ్‌రాజ్, చెన్నయ్‌లోని ఆస్తులను వేలం వేసింది. తాజాగా ఢిల్లీ, ముంబయి ఆస్తుల నగదీకరణ జరగనుందన్నారు. విశాఖపట్నంలోని రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్) భూముల నగదీకరణ ప్రక్రియలో భాగంగా 459 ప్లాట్లను వేలం వేయడానికి కేంద్రం ఇప్పటికే చర్యలు చేపట్టింది.

విశాఖపట్నంలోని హెచ్‌బి కాలనీ, మద్దిలపాలెం, ఆటోనగర్, గాజువాక ప్రాంతాల్లో 93,572 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్లాట్ల వేలానికి సంబంధించి విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్‌లో పెట్టుబడిదారుల సమావేశాలు నిర్వహించింది. ప్రభుత్వ రంగ సంస్థల మిగులు, వినియోగంలో లేని ఆస్తులను మార్కెట్‌లోకి తీసుకొచ్చే ప్రతిపాదన పేరుతో అడ్డంగా ప్రయివేటు, కార్పొరేట్ శక్తులకు చౌకగా కట్టబెడుతోందని ఆ సంస్థల ఉద్యోగులు చాలా ఏళ్లగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ప్రశాంతంగా మున్సిపోరు



- 23 పట్టణ స్థానిక సంస్థల్లో 55.07 శాతం పోలింగ్
- మంగళగిరి-తాడేపల్లిలో ఓటర్ల ఉత్సాహం
- కందుకూరులో అత్యధికంగా 68.89 శాతం నమోదు
- రాజమహేంద్రవరంలో అత్యల్పంగా 48.58 శాతం
- మొత్తం 24.98 లక్షల మంది ఓటర్లకు గాను 13.75 లక్షల మంది ఓటు
- ఈ నెల 30న ఓట్ల లెక్కింపు

**అమరావతి :** రాష్ట్రంలోని 23 పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నాలుగు మున్సిపల్ కార్పొరేషన్లు, 19 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో గురువారం ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం వరకు కొనసాగింది. రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారిక గణాంకాల ప్రకారం మొత్తం 24,98,312 మంది ఓటర్లకు గాను 13,75,799 మంది ఓటేశారు. దీంతో 55.07 శాతం పోలింగ్ నమోదైంది.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ కుటుంబసభ్యులు నివసించే మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంటీఎంసీ) పరిధిలో ఓటర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఇక్కడ 62.91 శాతం పోలింగ్ నమోదైంది. మరోవైపు రాజమహేంద్రవరంలో ఓటింగ్ మందకొడిగా సాగింది. కాకినాడ, శ్రీకాకుళం పట్టణాల్లోనూ ఓటర్లు ఆశించిన స్థాయిలో పోలింగ్ కేంద్రాలకు రాలేదు.

పోలింగ్ శాతంలో ప్రకాశం జిల్లా కందుకూరు 68.89 శాతంతో అగ్రస్థానంలో నిలిచింది. మార్కాపురం జిల్లా పొదిలిలో 68.46 శాతం, శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలో 68.14 శాతం నమోదయ్యాయి. మంగళగిరి-తాడేపల్లిలో 62.91 శాతం, బి.కొత్తకోటలో 62.47 శాతం, పాలకొల్లులో 62.43 శాతం ఓట్లు పోలయ్యాయి. పొన్నూరులో 61.01 శాతం, చింతలపూడిలో 60.52 శాతం, శ్రీకాళహస్తిలో 59.73 శాతం, రాజాంలో 59.42 శాతం, గుడివాడలో 58.85 శాతం పోలింగ్ నమోదైంది. నరసరావుపేటలో 57.98 శాతం, తణుకులో 57.55 శాతం, తాడేపల్లిగూడెంలో 57.24 శాతం, బాపట్లలో 56.60 శాతం, భీమవరంలో 56.51 శాతం, అల్లూరులో 54.98 శాతం, కావలిలో 54.04 శాతం ఓట్లు పోలయ్యాయి. కాకినాడ, తాడిగడపలో 50.36 శాతం చొప్పున నమోదైంది. శ్రీకాకుళంలో 49.05 శాతం, గూడూరులో 48.53 శాతం, రాజమహేంద్రవరంలో 48.58 శాతం పోలింగ్ నమోదైంది.

రాష్ట్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఎన్నికల నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుంచి అధికారులతో మాట్లాడి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు తీసుకున్న చర్యలను సమీక్షించారు.

23 పట్టణ స్థానిక సంస్థల్లో పోలింగ్ ముగియడంతో అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ పెట్టెల్లో నిక్షిప్తమైంది. ఈ నెల 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడించనున్నారు.

## పోలీస్ శాఖలో 1,534 కొలువులు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** పోలీస్ శాఖలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. మొత్తం 1,534 ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు పోలీస్ నియామక బోర్డు ఛైర

# త్వరలో రెండు వేల హోంగార్డు కొలువులు
# డిసెంబర్ 6లోపే నోటిఫికేషన్‌కు కసరత్తు

- పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో దాదాపు టీజీ మార్స్ అవసరాలకు అనుగుణంగా నియామకాలు
- జిల్లాల వారీగా ఖాళీల గుర్తింపు
- టెన్త్, ఇంటర్ అర్హతతో ఉద్యోగాలు
- డిసెంబర్ 6 లోపే నోటిఫికేషన్‌కు కసరత్తు

**హైదరాబాద్, నవంబరు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో కొత్త హోంగార్డుల నియామకాలకు రంగం సిద్ధం అయ్యింది. దాదాపు 2 వేల పోస్టులను భర్తీ చేసేందుకు డీజీపీ కార్యాలయం కసరత్తు ప్రారంభించింది. ప్రస్తుతం విధుల్లో ఉన్న హోంగార్డులతో పాటు ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ సహా అన్ని విభాగాల్లోకి ఎంత మంది అవసరం అవుతారనే వివరాలు సేకరిస్తోంది. కొత్తగా రిక్రూట్ చేసుకునే హోంగార్డులను తెలంగాణ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ అండ్ రైల్ సేఫ్టీ బ్యూరో (టీజీ-మార్స్) అవసరాల కోసం నియమించేందుకు ఏర్పాట్లు చేస్తున్నది. ఈ మేరకు డీజీపీ సీవీ ఆనంద్ ఇటీవలే హోంగార్డుల ప్రక్రియపై మినీ స్టాఫ్ ఆఫీసర్లతో సమీక్ష జరిపిన సంగతి తెలిసిందే. ఆయన ఆదేశాల మేరకు నియామకాలకు సంబంధించిన అంశాలను పరిశీలిస్తున్నారు. ఈ విషయంపై డీజీపీ సీవీ ఆనంద్ ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది.

### రైజింగ్ డే కు ముందే

డిసెంబర్ 6న హోంగార్డు రైజింగ్ డే సందర్భంగా నియామక నోటిఫికేషన్ విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. నియామకాలకు సంబంధించి ఇతర విధివిధానాలపైనా చర్చించినట్టు తెలిసింది. కనీస విద్యార్హత పదో తరగతి లేదా ఇంటర్మీడియట్ ప్రాతిపదికగాన నియామకాలు చేపట్టే అవకాశాలున్నాయని ఓ సీనియర్ అధికారి తెలిపారు. ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్‌లో విధులు నిర్వహించాల్సి ఉండటంతో అభ్యర్థుల శారీరక సామర్థ్యాన్ని కూడా పరిగణలోకి తీసుకోనున్నారు. ఈ మేరకు జిల్లాల వారీగా ఖాళీలను గుర్తించి స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యం ఇచ్చే అంశాలను పోలీసు ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. కాగా, యూనిఫాం సర్వీసెస్ కావడంతో హోంగార్డుల నియామకాల్లో ఎలాంటి అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా ఎంపిక చేసే దిశగా డీజీపీ కార్యాలయం ఏర్పాట్లు చేస్తున్నది.

# అర్హులైన వ్యక్తులు, సంస్థల నుంచి ఎమినెంట్ క్రిస్టియన్ అవార్డులకు నామినేషన్లు ఆహ్వానం : జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహమ్మద్ ముజాహిద్

- క్రైస్తవ సమాజానికి విశిష్ట సేవలందించిన వారికి ఎమినెంట్ క్రిస్టియన్ అవార్డులు– 2026

**ఖమ్మం, నవంబరు 26(జర్నలిస్ట్ ఫైల్):** క్రైస్తవ సమాజ అభ్యున్నతికి విశిష్ట సేవలందించిన వ్యక్తులు, సంస్థలకు తెలంగాణ ప్రభుత్వం 2026 సంవత్సరానికి ఎమినెంట్ క్రిస్టియన్ అవార్డులను అందజేయనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహమ్మద్ ముజాహిద్ ఒక ప్రకటనలో తెలిపారు.సామాజిక సేవ, వైద్యం, విద్య, సాహిత్యం, లలిత కళలు, నాటక రంగం, క్రీడా రంగాల్లో కనీసం 10 సంవత్సరాల పాటు సేవలందించిన వ్యక్తులు ఈ అవార్డులకు అర్హులని తెలిపారు. అదేవిధంగా ఆరోగ్యం, విద్య, సామాజిక సేవా రంగాల్లో కనీసం 25 సంవత్సరాల పాటు సేవలందించిన సంస్థలు కూడా అవార్డులకు అర్హులని అన్నారు.ఎంపికైన వ్యక్తులకు రూ. 1 లక్ష నగదు పురస్కారం, సంస్థలకు రూ. 2 లక్షల నగదు పురస్కారంతో పాటు ప్రశంసా పత్రం అందజేయడం జరుగుతుందని తెలిపారు.2026 నవంబర్ 25 నుంచి డిసెంబర్ 4వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అర్హులైన వారు తమ నామినేషన్లను సమర్పించవచ్చని తెలిపారు.ఆసక్తి గల వారు తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ వెబ్‌సైట్ www.tgcmfc.in ద్వారా వివరాలు తెలుసుకోవచ్చని, లేదా 040-23391067 నంబరును సంప్రదించవచ్చని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులను డిసెంబర్ 4వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కార్యాలయం, ఖమ్మం కార్యాలయంలో సమర్పించాలని కోరారు.అర్హులైన వ్యక్తులు, సంస్థలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సకాలంలో నామినేషన్లు సమర్పించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహమ్మద్ ముజాహిద్ ఆ ప్రకటనలో కోరారు.

# మధిర పట్టణంలో అనుమతులు లేకుండా చెట్టు నరికివేత

- చెరుకుపల్లి వారి వీధిలో చెట్టును తొలగించి రోడ్డుపై పడేసిన వైనం
- స్థానికుల ఫిర్యాదుతో అటవీ శాఖ అధికారుల విచారణ
- చెట్టు తొలగించిన అంగన్‌వాడీ టీచర్ పై కేసు నమోదు చేసిన ఫారెస్ట్ అధికారులు



**మధిర, నవంబరు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** మధిర పట్టణంలో అనుమతులు లేకుండా చెట్టును తొలగించినా వారిపై ఫారెస్ట్ అధికారులు కేసు నమోదు చేశారు. మధిర పట్టణంలోని చెరుకుపల్లి వారి వీధిలో నివాసముంటున్న అంగన్వాడి టీచర్ కు చెందిన వ్యక్తులు, అటవీ శాఖ అనుమతి లేకుండా తమ ఇంటి వద్ద ఉన్న చెట్టును నరికివేశారు. అంతేకాకుండా నరికిన చెట్టును రహదారిపై పడేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనిపై చుట్టుపక్కల వారు అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో, ఫారెస్ట్ అధికారులు విచారణ చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘించి చెట్టును తొలగించిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

# ప్రతి ఒక్కరికీ జీవిత భీమా భరోసా కల్పించడమే ఇందిరా గాంధీ జీవిత భీమా పథకం లక్ష్యం : సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్





**ఖమ్మం, నవంబరు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం, మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ప్రజల సంక్షేమం, ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరా గాంధీ జీవిత భీమా పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ జీవిత భీమా సౌకర్యం అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ తెలిపారు. ఈ పథకంలో భాగంగా తెల్ల రేషన్ కార్డు కలిగిన వారితో పాటు రేషన్ కార్డు లేని వారికి సైతం ప్రభుత్వం అవకాశం కల్పించే దిశగా ఈ పథకాన్ని తీసుకువచ్చిందని పేర్కొన్నారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి డివిజన్‌లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి, ప్రజలకు పథకంపై అవగాహన కల్పించడంతో పాటు ఆన్‌లైన్ ద్వారా నమోదు ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం ఖమ్మం నగరంలోని వివిధ 08,10,19,20 డివిజన్లలో ఏర్పాటు చేసిన ఇందిరా గాంధీ జీవిత భీమా నమోదు కేంద్రాలను సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ సందర్శించారు. ఆయా కేంద్రాల్లో జరుగుతున్న ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించి, సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నమోదు ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శులు, పార్టీ ముఖ్య నాయకులు ప్రజల్లో ఈ పథకంపై విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి ఇంటికి వెళ్లి అర్హులైన వారందరికీ పథకం వివరాలను తెలియజేసి, ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేలా సహకరించాలని సూచించారు. ప్రభుత్వం ఎంతో మంచి ఉద్దేశంతో తీసుకువచ్చిన ఈ పథకం అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని అన్నారు.ఈ సందర్భంగా మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ ఇందిరా గాంధీని స్మరించుకుంటూ, దేశ ప్రధానమంత్రిగా ఆమె పేదరిక నిర్మూలన, సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం, బలహీన వర్గాల అభ్యున్నతికి విశేష ప్రాధాన్యతనిచ్చారని తెలిపారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమం, మహిళల సాధికారత, దేశంలోని ప్రతి సామాన్య కుటుంబానికి భద్రత కల్పించాలనే ఆశయంతో ఆమె అనేక ప్రజాహిత కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. అలాంటి గొప్ప నాయకురాలి పేరుతో ప్రజలకు జీవిత భీమా భరోసా కల్పించే ఈ పథకం అమలు కావడం సంతోషకరమని తెలిపారు.అనంతరం ఆయా డివిజన్లకు చెందిన మాజీ కార్పొరేటర్లు తమ డివిజన్లలో నెలకొన్న పలు స్థానిక సమస్యలను సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్ దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతూ వినతిపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్ కమర్తపు మురళి, సీనియర్ నాయకులు పాలకుర్తి నాగేశ్వరరావు, మాజీ కార్పొరేటర్ మాధురి నారాయణరావు, సైదులు, చామకూరి వెంకన్న, డివిజన్ అధ్యక్షులు కోటి, భాస్కర్, మున్సిపల్ సహాయ కమిషనర్ అనిల్ కుమార్, సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దంసలాపురంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్





**ఖమ్మం, నవంబరు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని దంసలాపురంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దరఖాస్తుల స్వీకరణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్లను మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య బుధవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కౌంటర్ల వద్దకు వచ్చిన దరఖాస్తుదారులతో కమిషనర్ మాట్లాడి, వారి రేషన్ కార్డుల వివరాలను స్వయంగా పరిశీలించారు. అలాగే, కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి సంబంధించిన వివరాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకుని, వారికి అందజేసిన నూతన స్మార్ట్ రేషన్ కార్డులను పరిశీలించారు. రేషన్ కార్డులు కలిగిన అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని, అర్హులైన వారు ఎవరూ ఈ అవకాశాన్ని కోల్పోకుండా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

# ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి

- పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి : మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య





**ఖమ్మం, నవంబరు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లను బుధవారం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు.ఈ సందర్భంగా స్టేడియంలో చేపట్టిన పనుల పురోగతిని, ఇప్పటివరకు పూర్తయిన పనులను, ప్రస్తుతం కొనసాగుతున్న పనుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంకా ప్రారంభించాల్సిన పనులు, వాటి అమలు తీరుపై సమీక్షించారు.అనంతరం కమిషనర్ మాట్లాడుతూ స్టేడియంలో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలని, ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు.

# చిన్నారుల సంరక్షణకు అంగన్వాడీ కమ్ క్రెచ్ కేంద్రం!

- మహిళల ఉపాధికి భరోసా.. బాలల సమగ్ర అభివృద్ధికి బాటలు
- నందిగామలో నూతన కేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా సంక్షేమ అధికారి శాంతిశ్రీ





**రంగారెడ్డి జిల్లా నవంబరు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** చిన్నారుల సంరక్షణకు భరోసా కల్పిస్తూ,మహిళలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకునేందుకు ప్రభుత్వం మరో ముందడుగు వేసింది.మహిళా అభివృద్ధి,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా నందిగామ గ్రామంలో నూతన అంగన్వాడీ కమ్ క్రెచ్ కేంద్రాన్ని ప్రారంభించారు.జిల్లా సంక్షేమ అధికారి జి. శాంతిశ్రీ, నందిగామ గ్రామ సర్పంచ్ కృష్ణయ్య, ఎంపీడీవో అరుంధతి సంయుక్తంగా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ ఉదయ, డీహెచ్ఈడబ్ల్యూ సిబ్బంది, షాద్నగర్ ప్రాజెక్ట్ సూపర్వైజర్లు, మొబైల్ క్రెచెస్ తెలంగాణ ప్రోగ్రామ్ ఆఫీసర్ కమ్ ట్రైనర్ మాణికప్ప, రంగారెడ్డి జిల్లా క్రెచ్ సూపర్వైజర్ పవిత్ర,క్రెచ్ టీచర్,వార్డు సభ్యులు, కమ్యూనిటీ సభ్యులు,చిన్నారుల తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి జి.శాంతిశ్రీ మాట్లాడుతూ అంగన్వాడీ కమ్ క్రెచ్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ముఖ్యంగా పేద,మధ్యతరగతి,పని చేసే కుటుంబాలకు చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ కేంద్రాల్లో సురక్షితంగా ఉంచి ఉద్యోగ,ఉపాధి అవకాశాలను వినియో గించుకోవచ్చని తెలి పారు. చిన్నారులకు నాణ్యమైన సంరక్షణ, పౌష్టికాహారం,ఆరోగ్య పరిరక్షణ, భద్రతతో పాటు వయస్సుకు తగిన విద్యా బోధన,ఆటపాటల ద్వారా అభ్యాసం అందించడం ఈ కేంద్రాల ప్రధాన ఉద్దేశమని వివరించారు. పిల్లల సంరక్షణ బాధ్యతల కారణంగా మహిళలు ఉపాధి అవకా శాలకు దూరం కాకుండా ఈ కేంద్రాలు ఎంతగానో ఉపయోగ పడతాయని పేర్కొన్నారు.మహిళలు స్వయం ఉపాధి,ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు క్రెచ్ కేంద్రాలు దోహదపడతాయని అన్నారు.

**మహిళల భద్రతకు సమాజం బాధ్యత వహించాలి**

అంతర్జాతీయ మహిళలపై హింస నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళల హక్కులు,గౌరవం, భద్రత, సమానత్వంపై అవగాహన కల్పించారు.మహిళలపై హింసను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, మహిళలకు సురక్షితమైన,గౌరవప్రదమైన వాతావరణాన్ని కల్పించాలని పిలుపునిచ్చారు.

చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, భద్రత,బాలల సమగ్ర అభివృద్ధితో పాటు తల్లిదండ్రుల ఉపాధి అవకాశాలపై ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. అధికారులు,ప్రజాప్రతినిధులు,అంగన్వాడీ సిబ్బంది,కమ్యూనిటీ సభ్యులు,తల్లిదండ్రుల భాగస్వామ్యంతో ప్రారంభోత్సవ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.

చిన్నారుల బంగారు భవిష్యత్తుకు భరోసా కల్పిస్తూ..మహిళల ఆర్థిక స్వావలంబనకు బాటలు వేయడమే అంగన్వాడీ కమ్ క్రెచ్ కేంద్రాల ప్రధాన లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు.

# మానవ అక్రమ రవాణా నిరోధానికి పటిష్ట చర్యలు!

- బాధితుల రక్షణ,పునరావాసంపై జిల్లా స్థాయి సమీక్ష
- అదనపు కలెక్టర్ కిరణ్మయి



**రంగారెడ్డి జిల్లా నవంబరు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** రంగారెడ్డి జిల్లాలో మానవ అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టడంతో పాటు,బాధితుల రక్షణ,పునరావాసం,సమాజంలో పునరేకీకరణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి అధికారులను ఆదేశించారు.ఈ అంశాలపై ఆమె ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా మహిళలు,బాలల అక్రమ రవాణా నిరోధం, బాధితులను సురక్షితంగా రక్షించడం,వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించడం,గౌరవప్రదమైన జీవనం సాగించేలా పునరావాసం కల్పించడంపై సమావేశంలో చర్చించారు.వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేసి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.ఈ సందర్భంగా పోక్సో చట్టం,పోక్సో చట్టం,గృహ హింస నిరోధక చట్టం,బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన చట్టం అమలు,ఆపరేషన్ ముస్కాన్,భరోసా,సఖి కేంద్రాల పనితీరును సమీక్షించారు.మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం (యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్) ద్వారా నమోదైన కేసులు,త్రైమాసిక గణాంకాలు, పెండింగ్ కేసుల పురోగతిపై చర్చించారు.బాధితుల గుర్తింపు,రక్షణ,పునరావాసం,నివారణ చర్యలను పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయి ఉప కమిటీ ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశమై సమీక్ష నిర్వహించనుంది. పోలీస్,మహిళా శిశు సంక్షేమం,డీ ఆర్డీఏ,బాలల సంరక్షణ విభాగాలతో పాటు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో హైదరాబాద్ సిటీ డీసీపీ డాక్టర్ లావణ్య, సైబరాబాద్ డీసీపీ కె. శ్రీదేవి,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి రవి,జిల్లా మహిళా సంక్షేమ అధికారి శాంతి శ్రీ,పౌర సంబంధాల అధికారి బి.మల్లేశ్వరి,పోలీస్ అధికారులు,బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ డాక్టర్ నరేందర్ రెడ్డి,బాలభవన్ కో-ఆర్డినేటర్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

- బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై నిరసన
- సీఐటీయూ సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి మహేందర్



**అడ్డగుట్ట, నవంబరు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి టీ మహేందర్ ఆటో డ్రైవర్లకు పిలుపునిచ్చారు. సీఐటీయూ సికింద్రాబాద్ జోన్ ఆధ్వర్యంలో తుకారంగేట్ పహాడి హనుమాన్ ఆలయం వద్ద జరిగిన ఆటో డ్రైవర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో డిసెంబర్ 1 2 3 తేదీలలో చేపట్టిన చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ స్వయం ఉపాధిపై ఆధారపడి జీవిస్తున్న ఆటో డ్రైవర్లతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న రవాణా రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో బీజేపీ కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా డిసెంబర్ 1, 2, 3 తేదీలలో నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని ఆటో డ్రైవర్లు, రవాణా రంగ కార్మికులు ఐక్యంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.దేశ రవాణా వ్యవస్థలో ఆటో డ్రైవర్ల పాత్ర ఎంతో కీలకమని, ప్రతిరోజూ ప్రజలకు రవాణా సేవలు అందిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్న ఆటో కార్మికులు అనేక సమస్యలతో సతమత మవుతున్నారని అన్నారు. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు, వాహనాల విడిభాగాల ధరలు, ఇన్సూరెన్స్, ఫిట్నెస్, పర్మిట్ ఖర్చులు ఆటో డ్రైవర్ల ఆదాయాన్ని హరిస్తున్నాయని పేర్కొన్నారు. అయినప్పటికీ వారి కుటుంబాలకు కనీస సామాజిక భద్రత కల్పించే సమగ్ర ట్రాన్స్పోర్ట్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను పరిమితం చేసే నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చి కార్మిక సంఘాల పోరాట హక్కులకు, ఉద్యోగ భద్రతకు సవాళ్లు విసురుతోందని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్యం, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా విధానాలు రూపొందించడం వల్ల సాధారణ కార్మికుల జీవన పరిస్థితులపై ప్రభావం పడుతోందన్నారు.

ఆటో డ్రైవర్లకు ప్రత్యేక ట్రాన్స్పోర్ట్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, వృద్ధాప్య పెన్షన్, పిల్లల విద్యకు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఆన్లైన్ రవాణా సంస్థల ఏకపక్ష విధానాలను నియంత్రించాలని, పెరుగుతున్న ఇంధన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు కైలాష్ , శేఖర్, చిన్న ,శివ, శేఫి, భీమ్, నర్సింగ్ రావు,సతీష్, వెంకటేష్, రాజు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## యువత రాజకీయాల్లోకి రావాలి:ఆకాష్ కొల్లూరు

- పట్టభద్రుల ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన కవితకు కృతజ్ఞతలు



**సికింద్రాబాద్, నవంబరు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** యువత రాజకీయాల్లోకి వచ్చి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆకాష్ కొల్లూరు పిలుపునిచ్చారు.ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ బండారి మహేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సమావేశానికి ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జ్ డా.రఘు,సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి సురభి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆకాష్ కొల్లూరు మాట్లాడుతూ.జర్నలిజం రంగంలో తనకున్న అనుభవం,ప్రజా సమస్యలపై అవగాహన,సమాజం పట్ల ఉన్న బాధ్యతను గుర్తించిన పార్టీ అధ్యక్షురాలు కవిత తనకు పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేసే అవకాశం కల్పించారని,అందుకు కృతజ్ఞతలు తెలిపారు.దేశ రాజకీయాల నుంచి క్షేత్రస్థాయిలోని గల్లీ రాజకీయాల వరకు తనకు అవగాహన ఉందన్నారు.యువత ఎదుర్కొంటున్న సమస్యలు,పేద ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకున్నానని పేర్కొన్నారు.అవినీతి రాజకీయాలకు స్వస్తి పలికి,పారదర్శకమైన పాలన కోసం యువత,విద్యావంతులు రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందన్నారు.జర్నలిస్టుగా పనిచేసిన అనుభవంతో పాటు సామాన్య కుటుంబం నుంచి వచ్చిన విద్యావంతుడిగా ప్రజా సమస్యలపై తనకు స్పష్టమైన అవగాహన ఉందని తెలిపారు.హైదరాబాద్లోని కవాడిగూడలో పుట్టి పెరిగిన తనకు ఈ ప్రాంత ప్రజల జీవన పరిస్థితులు,సమస్యలు తెలుసన్నారు.రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన తరపున పోటీ చేస్తున్న తనకు పట్టభద్రులు,యువత ఆలోచించి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రజల భూములు అమ్మకానికి కాదు.. ప్రజల హక్కు!

- ప్రభుత్వ భూముల విక్రయ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం..
- ప్రజా ఆస్తుల పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తాం: బీఆర్ఎస్ నాయకుడు పొట్ట నరేందర్ యాదవ్



**శేర్లింగంపల్లి , నవంబరు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** శేరిలింగంపల్లి, కూకట్పల్లి నియోజకవర్గాల పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను విక్రయించాలనే కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీఆర్ఎస్ నాయకుడు పొట్ట నరేందర్ యాదవ్ స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములు ప్రజల ఆస్తులని, వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. ప్రజలకు చెందాల్సిన విలువైన భూములను విక్రయానికి పెట్టడం సరైన నిర్ణయం కాదని పేర్కొన్నారు.కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నాయకత్వంలో హెచ్ఎండీఏ కార్యాలయం ఎదుట ప్రభుత్వ భూముల విక్రయ నిర్ణయానికి వ్యతిరేకంగా చేపట్టిన ధర్నాలో పొట్ట నరేందర్ యాదవ్ పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శేరిలింగంపల్లి, కూకట్పల్లి ప్రాంతాల్లో ప్రభుత్వానికి చెందిన భూములను విక్రయించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ప్రభుత్వ భూములు కేవలం ఆస్తులు మాత్రమే కాదని, అవి భవిష్యత్తు తరాలకు ఉపయోగపడాల్సిన ప్రజా సంపద అని పేర్కొన్నారు. పట్టణాలు వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ భూములు ప్రజా అవసరాలకు ఎంతో కీలకమని, వాటిని విక్రయించడం వల్ల భవిష్యత్తులో ప్రజా ప్రయోజనాలకు అవసరమైన స్థలాల కొరత ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రజలకు ఉపయోగపడాల్సిన భూములను అమ్మకానికి పెట్టే ప్రయత్నాలను బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని, ప్రజా ఆస్తుల పరిరక్షణ కోసం పార్టీ తరఫున నిరంతరం పోరాటం చేస్తామని తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజల హక్కులను కాపాడేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ ముందుకు రావాలని పొట్ట నరేందర్ యాదవ్ పిలుపునిచ్చారు.

## క్రిస్మస్ వేడుకలకు చర్చిలకు రూ.30 వేల ఆర్థిక సాయం

- నవంబర్ 30లోగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి
- పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**శేర్లింగంపల్లి నవంబరు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని శేర్ లింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని అర్హత కలిగిన చర్చిలకు సున్నం వేయడం, విద్యుత్ దీపాలంకరణ కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.30 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించనుందని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తెలిపారు. ఈ నిధుల కోసం అర్హత కలిగిన చర్చిల నిర్వాహకులు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఏటా క్రిస్మస్ వేడుకలను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తోందని తెలిపారు. క్రిస్మస్ వేడుకలను అత్యంత వైభవంగా, కాంతివంతంగా జరుపుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా అర్హత కలిగిన చర్చిలకు సున్నం వేయడం, విద్యుత్ దీపాలంకరణ కోసం ఆర్థిక సహాయం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారని పేర్కొన్నారు.శేర్ లింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని నమోదిత చర్చిల నిర్వాహకులు నవంబర్ 23 నుంచి 30వ తేదీ వరకు రాదీవీమీ వెబ్సైట్ (tgobmms.cgg.gov.in) ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్లైన్ దరఖాస్తు అనంతరం డౌన్లోడ్ చేసుకున్న పత్రాలను అవసరమైన ధ్రువపత్రాలతో జతచేసి సంబంధిత జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి లేదా ఆయా సర్కిళ్ల ఉప కమిషనర్కు సమర్పించాలని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని అర్హత కలిగిన చర్చిల నిర్వాహకులు సద్వినియోగం చేసుకోవాలని గాంధీ కోరారు.

## రూ.169 కోట్లతో సైబరాబాద్ సీఎంసీ నూతన ప్రధాన కార్యాలయం

- ఇజ్జత్నగర్లో 4.11 ఎకరాల్లో ట్విన్ టవర్స్ నిర్మాణం..
- టెండర్లు ఆహ్వానించిన అధికారులు



**శేర్లింగంపల్లి, నవంబరు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) శాశ్వత ప్రధాన కార్యాలయ నిర్మాణానికి అధికారులు టెండర్లు ఆహ్వానించారు. శేరిలింగంపల్లి మండలం ఇజ్జత్నగర్లోని కొత్తకుంట చెరువు సమీపంలో 4.11 ఎకరాల విస్తీర్ణంలో ఈ నూతన కార్యాలయాన్ని నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టుకు రూ.169 కోట్ల అంచనా వ్యయాన్ని నిర్ణయించారు.అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పర్యావరణహితంగా రెండు ఎత్తైన భవనాలతో కూడిన సముదాయాన్ని నిర్మించనున్నారు. మొత్తం 2,41,540 చదరపు అడుగుల నిర్మాణ విస్తీర్ణంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టులో ఒక భవనం ఆరు అంతస్తులు, మరో భవనం ఎనిమిది అంతస్తులతో రూపుదిద్దుకోనుంది. భవిష్యత్తు పరిపాలనా అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఈ భవనాలను రూపొందించారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా నూతన కార్యాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. ఇందులో కౌన్సిల్ సమావేశ మందిరం, ప్రజావాణి హాల్, పౌర సేవా కేంద్రాలు, సమావేశ మందిరం, సమీకృత నియంత్రణ కేంద్రంతో పాటు వివిధ ప్రభుత్వ విభాగాలకు ప్రత్యేక కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నారు.

పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేస్తూ ఈ భవన సముదాయాన్ని నెట్జీరో ప్రమాణాలతో నిర్మించనున్నారు. సౌర విద్యుత్ వంటి పునరుత్పాదక ఇంధన వనరులు, విద్యుత్ ఆదా వ్యవస్థలు, వర్షపు నీటి సంరక్షణ, మురుగునీటి శుద్ధి, పునర్వినియోగం వంటి నదుపాయాలు కల్పించనున్నారు. భవన నిర్వహణకు ఆధునిక సాంకేతిక వ్యవస్థలను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు.వేగంగా అభివృద్ధి చెందుతున్న సైబరాబాద్ ప్రాంతానికి ఈ నూతన ప్రధాన కార్యాలయం ఆధునిక పరిపాలనా కేంద్రంగా నిలవనుంది. పర్యావరణహిత నిర్మాణంతో పాటు ప్రజలకు వివిధ పౌర సేవలను ఒకే చోట అందించేలా ఈ ప్రాజెక్టును చేపడుతున్నారు.టెండర్ల వివరాలను తెలంగాణ ప్రభుత్వ టెండర్ల వెబ్సైట్లో పొందవచ్చని అధికారులు తెలిపారు.

## అచ్చంపేటలో సంక్షేమ పథకాల సందడి!

- చేయూత పెన్షన్లు,ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభం
- సభకు తరలిరావాలని ఎంపీ మల్లు రవి పిలుపు



**ఆమనగల్లు, నవంబరు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** అచ్చంపేటలో రేపు నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని నాగర్కర్నూల్ ఎంపీ మల్లు రవి ఆమనగల్లు ప్రాంత కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,ప్రజలకు పిలుపునిచ్చారు. సభకు ఆమనగల్లు నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చి కాంగ్రెస్ పార్టీ బలాన్ని చాటాలని కోరారు.మద్దిమడుగు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ భూమిపూజ కార్యక్రమం అనంతరం అచ్చంపేట వై జంక్షన్లో జరగనున్న బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించేందుకు వెళ్తున్న ఎంపీ మల్లు రవికి బుధవారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలో ఘన స్వాగతం లభించింది.జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వస్పుల జంగయ్య ఆధ్వర్యంలో నాయకులు ఆయనకు స్వాగతం పలికి శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ అచ్చంపేటలో రేపు జరగనున్న బహిరంగ సభకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు,ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు,మున్సిపల్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం,సీనియర్ నాయకులు మధుసూదన్ రెడ్డి,గోల్డ్ రాము,పులికంటి మైసయ్య, పురుషోత్తం, వర్మాల శేఖర్,బొబ్బిలి తదితరులు పాల్గొన్నారు.

## అచ్చంపేట సభకు ఆమనగల్లు నుంచి భారీగా తరలిరండి

- కాంగ్రెస్ శ్రేణులకు ఎంపీ మల్లు రవి పిలుపు



**కడ్తాల్, నవంబరు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** ఈరోజు అచ్చంపేటలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు కడ్తాల్ మండల ప్రజలు,గిరిజనులు,మహిళలు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని నాగర్కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి పిలుపునిచ్చారు.బుధవారం కడ్తాల్లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోతుగంటి శంకర్,పట్టణ అధ్యక్షుడు మాలే మల్లేష్ గౌడ్ ల ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..మద్దిమడుగు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ భూమిపూజ నిర్వహించనున్నట్లు తెలిపారు.అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే అచ్చంపేట బహిరంగ సభలో సుమారు రూ.100 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించారు.కొత్తగా మంజూరైన 4.72 లక్షల చేయూత పెన్షన్ల నగదును లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారని తెలిపారు.ప్రజా సంక్షేమం,గిరిజన అభివృద్ధి,మహిళా సాధికారతకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొంటూ ప్రతి ఒక్కరూ సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో పీసీసీ కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ గౌడ్,నాయకులు మధుసూదన్ రెడ్డి,చేగురి వెంకటేష్,యాట నరసింహ,పోతుగంటి శంకర్,బీచ్యా నాయక్,క్యామ రాజేష్,యాట రవి,లక్పతి నాయక్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# మంథని అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి శ్రీధర్‌బాబు



**మంథని, నవంబరు26(జర్నలిస్ట్ ఫైల్):**మంథని మున్సిపల్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులతో పనుల పురోగతిపై సమీక్షించారు.అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని చేపడుతున్న అభివృద్ధి పనులను ఎక్కడా నాణ్యతలో రాజీ పడకుండా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షించాలని, చీఫ్ ఇంజినీర్, సీఈ స్థాయి అధికారులకు కూడా స్పష్టమైన సూచనలు చేసినట్లు తెలిపారు.మంథనిలో ఐటీఐకి సంబంధించి అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) పనులను త్వరలోనే ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.కొంతమంది ఎప్పుడూ విమర్శలు చేస్తూనే ఉంటారని, అలాంటి విమర్శలను పట్టించుకోకుండా ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తూ ముందుకు సాగుతామని స్పష్టం చేశారు.గోదావరి పుష్కరాలు ఎంతో పవిత్రమైన కార్యక్రమమని, దీనికి సంబంధించిన పనుల్లో ఎక్కడా అవినీతికి తావులేకుండా పూర్తి పారదర్శకతతో, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని మంత్రి శ్రీధర్ బాబు అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# మహిళలపై హింస నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**శామీర్‌పేట, నవంబరు 26 (జర్నలిస్ట్ ఫైల్) :**




మహిళలు, బాలికలపై జరుగుతున్న హింసను అరికట్టి, వారికి చట్టపరమైన రక్షణ కల్పించడంతో పాటు సమాజంలో లింగ సమానత్వాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళలపై హింస నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం అలియాబాద్ మున్సిపల్ కార్యాలయంలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని సఖి వన్‌స్టాప్ కేంద్రం ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు.నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు నిర్వహించే 16 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. 2026 సంవత్సరానికి ఐక్యరాజ్యసమితి రూపొందించిన 'మహిళలు, బాలికలపై హింసను అంతం చేయడానికి ఏకమవ్వండి' అనే నినాదంతో న్యాయం అందించడం, బాధితులకు రక్షణ కల్పించడం, నేరస్థులకు శిక్ష పడేలా చూడడం ప్రధాన లక్ష్యమని వివరించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మహిళలు, బాలికలపై హింస ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనగా కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పురుషులు, మహిళలను అన్ని రంగాల్లో సమానంగా చూడాలని, లింగ వివక్షకు తావులేకుండా సామాజిక మార్పు తీసుకురావాలని సూచించారు. మహిళలకు ఉన్న చట్టపరమైన హక్కులు, రక్షణ చట్టాలు, న్యాయం పొందే మార్గాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.మహిళలు హింసకు గురైనప్పుడు వారికి అండగా నిలిచేందుకు సఖి వన్‌స్టాప్ కేంద్రాలు అందిస్తున్న సేవలను వివరించారు. బాధిత మహిళలకు వైద్య సహాయం, మానసిక కౌన్సెలింగ్, పోలీసు సహాయం, న్యాయ సహాయం, తాత్కాలిక వసతి వంటి సమీకృత సేవలను 24 గంటల పాటు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. అత్యవసర సహాయం కోసం మహిళలు 181 మహిళా హెల్ప్‌లైన్‌కు, బాలల రక్షణ కోసం 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని సూచించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీష కృష్ణారెడ్డి హాజరయ్యారు. 20వ వార్డు కౌన్సిలర్ మౌనిక, అలియాబాద్, మల్కాజ్‌గిరి ప్రాంతాల వైద్యాధికారులు డాక్టర్ సంగీత, డాక్టర్ ఎలీనా, సఖి కేంద్రం ఇన్‌చార్జి తిరుమల దేవి, నిర్వాహకులు సలోమి, రేణుక, అలియాబాద్ పర్యవేక్షకులు నాగమణి, మమత, సఖి కేస్ వర్కర్ శిరీషతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

# హాడ్ హెల్ప్ హై ఫౌండేషన్,గుడెర సంస్థ సౌజన్యంతో విద్యార్థులకు సైకిల్ పంపిణీ

**:సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్.**




**రాజేంద్రనగర్, నవంబరు 26 (జర్నలిస్ట్ ఫైల్) :** నర్కుడ గ్రామ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ హాడ్ హెల్ప్ హై ఫౌండేషన్,గుడెర సంస్థ వారి సహకారంతో నిరుపేద విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు.జిల్లా పరిషత్ పాఠశాలలో కవ్వగూడ,సుల్తాన్‌పల్లి,చౌదరిగూడ గ్రామాలకు చెందిన నిరుపేద విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు.విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు ఎదుర్కొంటున్న ప్రయాణ ఇబ్బందులను తగ్గించి,విద్యాభ్యాసానికి మరింత ప్రోత్సాహం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ మాట్లాడుతూ..విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడుతూ నిరుపేద పిల్లలకు అండగా నిలిచిన హాడ్ హెల్ప్ హై ఫౌండేషన్,గుడెర సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు చదివి మంచి భవిష్యత్తును సాధించాలని ఆకాంక్షించారు.విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో అవసరమని,విద్యకు చేయూతనివ్వడం సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలస్వామి,నాయకులు తొంట అశోక్,గూడెపు లక్ష్మణ్,ఉపాధ్యాయ బృందం,సంస్థ కోఆర్డినేటర్లు సతీష్,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# సాలూర ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

**నిజామాబాద్, నవంబరు 26 (జర్నలిస్ట్ ఫైల్) :**



సాలూర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాల ఆవరణ,తరగతి గదులను పరిశీలించారు.ఎఫ్.ఆర్.ఎస్ విధానంలో విద్యార్థులు,ఉపాధ్యాయుల హాజరు ప్రక్రియను తనిఖీ చేశారు.మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు.మౌలిక వసతులు,అందుబాటులో ఉన్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు.స్థానికంగా విద్యార్థులకు పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయని,విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు లేవని హెచ్.ఎం రాజీ మంజుశ్రీ కలెక్టర్ దృష్టికి తేగా,ఐదు అదనపు తరగతి గదులను మంజూరు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.పాఠశాలకు ప్రహరీ గోడ,ప్లే గ్రౌండ్ ను కూడా మంజూరు చేస్తామని వెల్లడించారు.అయితే వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య మరింత గణనీయంగా పెరిగేలా అంకిత భావంతో కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.ఉపాధ్యాయులు అందరూ తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ,బోధనా విధులకు హాజరు కావాలని అన్నారు.ఎలాంటి అనుమతి లేకుండా విధులకు గైర్హాజర్ అయిన వారిని షోకాజ్ నోటీసులు అందించడం వంటివి కాకుండా నేరుగా సస్పెన్షన్ చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు.అదేవిధంగా విద్యార్థులు సైతం నూటికి నూరు శాతం మంది క్రమం తప్పకుండా బడికి హాజరయ్యేలా చూడాలన్నారు.ఎక్కువ రోజుల పాటు గైర్హాజర్ అయ్యే విద్యార్థిని విద్యార్థులపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని,వారు ఎందుకు బడికి రావడం లేదన్నది క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలించాలన్నారు.విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.ప్రతి విద్యార్థికి సంబంధించి తప్పనిసరిగా ఆధార్ సీడింగ్ పూర్తి చేయాలన్నారు.ఉన్నత పాఠశాలకు ఆనుకుని ఉన్న ఉర్దూ మీడియం స్కూల్ ను సైతం కలుపుకుని విద్యార్థులకు అనువైన రీతిలో ప్లే గ్రౌండ్ అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ 8వ తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో భేటీ అయ్యారు.గణితం సబ్జెక్టుపై ప్రశ్నలు వేసి,విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేశారు.చక్కగా సమాధానాలు చెప్పిన విద్యార్థులకు బహుమతులు,చాక్లెట్లు అందించారు.అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని,చక్కగా చదువుకోవాలని హితవు పలికారు.కలెక్టర్ వెంట ఇంచార్జి డీ.ఈ.ఓ సాయాగౌడ్,తహసీల్దార్ ఎం.ఏ.నవాజ్ తదితరులు ఉన్నారు.

# భారస నాయకులు గౌరిదేవి రాజును పరామర్శించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**ఎల్బీనగర్,నవంబరు 26 (జర్నలిస్ట్ ఫైల్):** ఎల్.బి.నగర్ నియోజకవర్గంలోని చంపాపేట డివిజన్, కర్మన్‌ఘాట్ పాత గ్రామానికి చెందిన గౌరీదేవి రాజు కార్యాలయం నుంచి ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో నాగోల్ మార్గమధ్యంలో అకస్మాత్తుగా తీవ్రమైన ఛాతినొప్పికి గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు, స్థానికుల సహకారంతో వెంటనే కామినేని ఆసుపత్రికి తరలించారు.రాజు ఆరోగ్య పరిస్థితిని పరిశీలించిన వైద్యులు వెంటనే స్పందించి గుండెపోటుగా అనుమానించి అత్యవసర చికిత్స అందించారు. అనంతరం విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు.ఈ విషయం తెలుసుకున్న ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కామినేని ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న రాజు ని పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.అనంతరం వైద్యులతో మాట్లాడి రాజు కి మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకునేలా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.ఇట్టి కార్యక్రమంలో ఉమ మహేశ్వరరావు,డాక్టర్లు పాల్గొన్నారు.

# గౌతమ్‌నగర్ ఆర్‌యూబీ నిర్మాణంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

**మల్కాజిగిరి, నవంబరు 26 (జర్నలిస్ట్ ఫైల్) :**



గౌతమ్‌నగర్ రైల్వే గేట్ వద్ద ప్రతిపాదిత రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) నిర్మాణ పనుల సందర్భంగా స్థానిక ప్రజలు, వ్యాపారులు, రైల్వే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా, ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా నిర్మాణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.ఈ మేరకు బుధవారం గౌతమ్‌నగర్ రైల్వే గేట్ వద్ద ప్రతిపాదిత ఆర్‌యూబీ నిర్మాణ ప్రాంతాన్ని రైల్వే, రెవెన్యూ, మున్సిపల్ ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగాల అధికారులతో కలిసి ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణానికి సంబంధించిన సాంకేతిక అంశాలు, రహదారుల అనుసంధానం, ప్రజల రాకపోకలపై అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా రైల్వే గేట్ సమీపంలోని అమ్మవారి దేవాలయం వెనుక నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే సర్వీస్ రోడ్డుతో పాటు, మల్కాజిగిరి రైల్వే స్టేషన్ సమీపంలోని మనీషా గార్డెన్ పక్క నుంచి వెళ్లే సర్వీస్ రోడ్డును ఎలాంటి మార్పులు లేకుండా యథావిధిగా కొనసాగించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ రెండు రహదారులు స్థానిక కాలనీవాసులు, రైల్వే ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని, వీటిని కొనసాగించడం వల్ల ప్రధాన రహదారిపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గుతుందని పేర్కొన్నారు.ఆర్‌యూబీ నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతంలో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు రైల్వే గేట్ వద్ద ట్రాఫిక్ సమస్యలకు ఉపశమనం లభిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. అయితే అభివృద్ధి పనుల పేరుతో ప్రజలకు అందుబాటులో ఉన్న రహదారులకు ఇబ్బందులు కలగకూడదని, స్థానికుల అవసరాలు, భవిష్యత్తు రవాణా అవసరాలను దృష్టిలో పెట్టుకుని సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.ఈ పరిశీలనలో రైల్వే శాఖ అదనపు డివిజనల్ ఇంజినీర్ వీరభద్రరావు, మల్కాజిగిరి తహసీల్దార్ సుజాత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్‌రెడ్డి, సర్వేయర్ బాలరాజు, మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం గౌతమ్‌నగర్ డీఈ లౌక్య, ఏఈ దివ్యజ్యోతి, పట్టణ ప్రణాళిక విభాగం టీపీఎస్ మేఘన, జీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, జేఏసీ వెంకన్న, మాసెట్టి అనిల్, బొబ్బిలి విజయ్‌రెడ్డి, బైరు అనిల్, కిట్టు, రవి హుస్సేన్, నగేష్, శ్రీనివాస్, మతిన్ యాదవ్, నర్సింగ్‌రావుతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# 30న పింఛన్ల పంపిణీ



**గుంటూరు, నవంబరు 26 (జర్నలిస్ట్ ఫైల్):** సామాజిక భద్రత పింఛన్లను ఈ నెల 30వ తేదీన పంపిణీ జరుగుతుందని జిల్లా కలెక్టర్ సి. యం. సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పింఛను సొమ్మును విత్ డ్రా చేయుటకు మండల పరిషత్ అభివృద్ధి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 30వ తేదీన పంపిణీకాని వారికి పట్టణ ప్రాంతాల్లోను, రెండవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగే పొన్నూరు, చేబ్రోలు, పెదకాకాని, తెనాలి, కొల్లిపర మండలాలలో డిసెంబరు 1 నుండి 4వ తేదీ వరకు, మూడవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు గల ప్రత్తిపాడు, పెదనందిపాడు, వట్టిచెరుకూరు, గుంటూరు రూరల్, కాకుమాను, దుగ్గిరాల, మేడికొండూరు, పిరంగిపురం మండలాలలో డిసెంబరు 3, 4 తేదీల్లో పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ మేరకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మునిసిపల్ కమిషనర్లు రూపొందించుకోవాలని ఆదేశించారు. స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు సిబ్బంది అందరికీ స్పష్టమైన సూచనలు జారీ చేసి పర్యవేక్షించాలని అన్నారు. పంపిణీ సమయంలో యథావిధిగా నిర్దేశిత మార్గదర్శకాలు పాటించాలని చెప్పారు.

## క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించిన జెసి



**గుంటూరు, నవంబరు 26 (జర్నలిస్ట్ ఫైల్):** కొల్లిపర మండలం చిగలూరు గ్రామంలో క్షేత్రస్థాయిలో పంటలను జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పరిశీలించారు. కోతలకు వచ్చిన పంటల పరిస్థితి వాటిని నూర్పిడి చేసే విధానం తదితర అంశాలను స్థానిక రైతులతో మాట్లాడి తెలుసుకున్నారు. ధాన్యం సేకరణ కేంద్రాల ఏర్పాటు పరిస్థితులను ఈ సందర్భంగా గమనించారు. ధాన్యం సేకరణ కేంద్రాల ఏర్పాటుకు గల అవకాశాలపై పౌర సరఫరాల సంస్థ అధికారులకు ఆదేశించారు. ధాన్యం సేకరణకు మార్గదర్శకాలు ఉండే విధానాన్ని రైతులకు వివరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులు ఎటువంటి పరిస్థితుల్లోనూ నష్టపోరాదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర విధిగా రైతులకు వచ్చే విధంగా అవగాహన కల్పించాలని చెప్పారు. అందుకు ధాన్యం ఆరబెట్టే విధానం, ధాన్యంలో తేమశాతం తక్కువగా ఉండుటకు చేపట్టాల్సిన చర్యలను వివరించాలని అన్నారు. కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరకు రైతులు విక్రయించకుండా సూచనలు సలహాలు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎం. పద్మావతి, డీ.సీ.ఎం.ఎస్ అధికారి రవీంద్రబాబు, కొల్లిపర తాసిల్దార్, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్ల రద్దు, కార్మిక హక్కుల సాధన కోసం ఢిల్లీకి పల్నాడు కార్మికులు



- విజయవాడ రైల్వే స్టేషన్‌లో సీఐటీయూ రాష్ట్ర నాయకుల ఘన వీడ్కోలు

**విజయవాడ, నవంబర్ 26 (జర్నలిస్ట్ ఫైల్):** లేబర్ కోడ్ల రద్దు, వేతనాల పెంపు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌తో పాటు కార్మిక హక్కుల సాధన కోసం డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో ఢిల్లీలో నిర్వహించనున్న 'ఆక్యుపై ఢిల్లీ' కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఐటీయూ పల్నాడు జిల్లా కార్మికులు, కమిటీ సభ్యులు గురువారం ఢిల్లీకి బయలుదేరారు.
విజయవాడ రైల్వే స్టేషన్ నుంచి ఢిల్లీ ప్రయాణం ప్రారంభించిన కార్మికులకు సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఘనంగా వీడ్కోలు పలికారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.వి. నాగేశ్వరరావు, కోశాధికారి కె.ఆర్.కె. మూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి. ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శులు ముజఫర్ అహ్మద్, ఆర్.వి. నరసింహారావు, దయా రమాదేవి తదితరులు కార్మికులకు నినాదాల ఆహ్వాన్లు అందించి సాగనంపారు.
కార్మిక హక్కుల పరిరక్షణ, వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, లేబర్ కోడ్ల రద్దు వంటి డిమాండ్ల సాధన కోసం ఢిల్లీలో నిర్వహించే కార్యక్రమంలో పల్నాడు జిల్లా కార్మికులు పాల్గొననున్నట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు.

# రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ బాధ్యతాయుత పౌరులుగా ముందుకు సాగాలి

- ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి గళ్ళా మాధవి

**మంగళగిరి, నవంబర్ 26(జర్నలిస్ట్ ఫైల్):** భారత రాజ్యాంగం నిర్దేశించిన విలువలను ప్రతి భారతీయుడు గౌరవిస్తూ, హక్కులు, బాధ్యతలను గుర్తించి బాధ్యతాయుత పౌరుడిగా ముందుకు సాగాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో 77వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, జాతిపిత మహాత్మా గాంధీ, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు విగ్రహాలకు గళ్ళా మాధవి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య, ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్. నాయుడు



(గణబాబు) పూలమాలలు వేసి నివాళులర్పించారు.
అనంతరం మీడియాతో గళ్ళా మాధవి మాట్లాడుతూ, ప్రజల కోసం ప్రజలే రూపొందించుకున్న నియమావళి భారత రాజ్యాంగమని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ 77వ రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకోవడం గర్వకారణమన్నారు. కులమతాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రతి భారతీయుడు స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవంతో పాటు రాజ్యాంగ దినోత్సవాన్ని కూడా గౌరవంగా, స్ఫూర్తితో జరుపుకోవాలని అన్నారు.
రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం మాత్రమే కాదని, దేశ ప్రజల హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, న్యాయానికి పునాది అని వివరించారు. సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, న్యాయం వంటి మౌలిక విలువలు భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు బలమైన పునాదులని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు, మహనీయుల కృషి, రాజ్యాంగ రూపకర్తల విజ్ఞతతో రూపొందిన రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను వినియోగించుకోవడంతో పాటు పౌర బాధ్యతలను కూడా ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు. ఇతరుల హక్కులను గౌరవిస్తూ, సమాజంలో పరస్పర గౌరవం, సమానత్వ భావనతో జీవించాలని, దేశ అభివృద్ధిలో బాధ్యతాయుత పౌరులుగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రామ్ ప్రసాద్, బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్, టీడీపీ సీనియర్ నేత ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ తదితరులు పాల్గొన్నారు.

# బాలుని కుటుంబానికి ఎమ్మెల్యే నసీర్ పరామర్శ

- చిన్నేరు కుంటలో పడి మృతి చెందిన బాలుని మృతదేహానికి నివాళి
- మట్టి ఖర్చులకు రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేత
- కుటుంబ సభ్యులను ఓదార్చిన ఎమ్మెల్యే
- ప్రమాదకర కుంట వద్ద పటిష్ట భద్రతా చర్యలకు ఆదేశం



**గుంటూరు, నవంబరు 26 (జర్నలిస్ట్ ఫైల్):** నగరంలోని నందివెలుగు రోడ్డు సమీపంలో గల చిన్నేరు కుంటలో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తూ నీటిలో పడి మృతి చెందిన బాలుని కుటుంబానికి గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ పరామర్శించారు. బాలుని మృతదేహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అల్లారుముద్దుగా పెంచుకున్న కొడుకు విగతజీవిగా పడి ఉండటం చూసి కన్నీరుమున్నీరవుతున్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులను ఆయన ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్ట సమయంలో తాను వ్యక్తిగతంగానూ, ప్రభుత్వం తరఫున ఎల్లప్పుడూ అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. స్థానిక కార్పొరేటర్ కోట పిచ్చి రెడ్డి, కూటమి నాయకులు అన్వర్, యడ్ల మల్లి, దిలీప్, పఠాన్ జమీర్, ముప్పా శైలజతోపాటు అధికారులను బాధిత కుటుంబం వద్దే ఉంచి సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు.

**అధికారులను అప్రమత్తం చేసిన ఎమ్మెల్యే**

నందివెలుగు రోడ్డులో బాలుడు చేపల వేట కోసం చిన్నేరు కుంట వద్దకు వెళ్లి ప్రాణాలు కోల్పోయిన విషాద వార్త తెలిసిన వెంటనే ఎమ్మెల్యే నసీర్ స్పందించారు. రాత్రి సమయంలోనే జిల్లా కలెక్టర్, ఆర్డీవోతోపాటు సంబంధిత రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. బాలుని మృతదేహాన్ని వెలికితీసే చర్యలను పర్యవేక్షించాలన్నారు.
బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా అన్ని విధాలా అండగా నిలవాలని సూచించారు. బాలుడు మృతి చెందిన చిన్నేరు కుంట వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, భవిష్యత్తులో ఇటువంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

**రూ. 10 వేలు ఆర్థిక సాయం**

బాలుని అంత్యక్రియలు, మట్టి ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే నసీర్ తక్షణ సాయంగా రూ. 10 వేలు నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. అంతేకాకుండా, స్థానికులు, చిన్నారులు ప్రమాదవశాత్తూ చిన్నేరు కుంటలోకి వెళ్లకుండా ఉండేందుకు కుంట చుట్టూ పటిష్టమైన కంచె (ఫెన్సింగ్) ఏర్పాటు చేసి, తగిన భద్రతా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మరోసారి ఇలాంటి ప్రాణనష్టం జరగకుండా అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని సూచించారు.

# పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో 73.30 శాతం పోలింగ్

**గుంటూరు, నవంబరు 26 (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ (ఎం.టి.ఎం.సి), పొన్నూరు మున్సిపాలిటీలకు గురువారం జరిగిన ఎన్నికలలో సరాసరిన 73.30 శాతం పోలింగ్ నమోదయిందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి. యం. సాయికాంత్ వర్మ తెలిపారు. రెండు మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని చెప్పారు. 73.30 శాతం ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారని, ఇందులో ఎం.టి.ఎం.సి పరిధిలో 74.65 శాతం, పొన్నూరు మున్సిపాలిటీలో 67.98 శాతం నమోదు అయిందని తెలిపారు. ఉదయం 7 గంటల నుండి పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైందని చెప్పారు.
మొదటి రెండు గంటల సమయం, తొమ్మిది గంటలకు ఎం.టి.ఎం.సి పరిధిలో 12.94 శాతం, పొన్నూరు మున్సిపాలిటీలో 13.99 శాతం వెరసి 13.16 శాతం నమోదు అయిందని తెలిపారు. 11 గంటల నాటికి ఎం.టి.ఎం.సి పరిధిలో 24.36 శాతం, పొన్నూరు మున్సిపాలిటీలో 31.23 శాతం వెరసి 25.75 శాతం, ఒంటి గంట సమయానికి ఎం.టి.ఎం.సి పరిధిలో 49.13 శాతం, పొన్నూరు మున్సిపాలిటీలో 49.82 శాతం వెరసి 49.27 శాతం, మధ్యాహ్నం 3 గంటల నాటికి ఎం.టి.ఎం.సి పరిధిలో 63.25 శాతం, పొన్నూరు మున్సిపాలిటీలో 60.83 శాతం వెరసి 62.75 శాతం నమోదు అయిందని వివరించారు. పోలింగ్ ముగిసే సమయానికి ఎం.టి.ఎం.సి పరిధిలో 74.65 శాతం, పొన్నూరు మున్సిపాలిటీలో 67.98 శాతం వెరసి 73.30 శాతం నమోదు అయిందని తెలిపారు.
ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమైనదని దానిని వినియోగించుకొని ప్రజాస్వామ్య విలువలను కాపాడారని అన్నారు. జిల్లాలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుటకు ప్రతిష్టమైన చర్యలను జిల్లా యంత్రాంగం చేపట్టింది ఇందులో భాగంగా పోలింగ్ రోజు సైతం మరింత నిశితంగా పర్యవేక్షణ చేయుటకు ఎం.టి.ఎం.సి, పొన్నూరు మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారులుగా జిల్లా అధికారులను నియమించడం జరిగింది. జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పొన్నూరు మున్సిపాలిటీ పరిధిలో పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు.
పోలీసు యంత్రాంగం సైతం ఎక్కడ ఎటువంటి సమస్య తల ఎత్తకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టడం జరిగింది.

# తెనాలి మలేరియా, ఫైలేరియా విభాగాలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో తనిఖీ

- వైద్య సేవల మెరుగుదలకు సిబ్బందికి జోనల్ మలేరియా అధికారిణి సూచనలు

**తెనాలి, నవంబర్ 26 (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు జోనల్ మలేరియా అధికారిణి డాక్టర్ టి. సూర్య మంగాదేవి గురువారం జోన్-3 పరిధిలోని తెనాలిలో మలేరియా, ఫైలేరియా విభాగాలతో పాటు నందుల పేట, సాలిపేట అర్బన్ హెల్త్ సెంటర్లను సందర్శించి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అర్బన్ హెల్త్ సెంటర్లలోని ప్రయోగశాల, ఫార్మసీ, ఓపీ విభాగాలను పరిశీలించిన ఆమె, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వైద్య సేవల నిర్వహణ, రోగులకు అందుతున్న సేవల నాణ్యతపై సమీక్షించారు. మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా, చికున్ గున్యా, మెదడువాపు వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులకు సంబంధించిన కేసుల వివరాలను పరిశీలించారు. ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న 'ఫ్రైడే--ఫ్రైడే' కార్యక్రమం అమలు తీరుతో పాటు వెక్టర్ కంట్రోల్ చర్యల పురోగతిని సమీక్షించారు. దోమల వ్యాప్తిని నియంత్రించి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు క్షేత్రస్థాయిలో కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని సూచించారు.



వ్యాధుల నివారణకు పరిసరాల పరిశుభ్రత, నిల్వ నీటి తొలగింపు, దోమల నియంత్రణ చర్యలు కీలకమని పేర్కొంటూ, ఆరోగ్య సిబ్బంది ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించాలని అధికారిణి సూచించారు.
ఈ సమీక్షా సమావేశంలో ఆరోగ్య విస్తరణాధికారి పి. భాస్కరరావు, తెనాలి మలేరియా, ఫైలేరియా విభాగ సబ్ యూనిట్ అధికారి జి. రవికుమార్, సూపర్వైజర్లు దీపాల శ్రీనివాసరావు, బండారు శివ నాగమల్లేశ్వరరావు, తిరువీధుల శివరామ దుర్గాప్రసాద్, అర్బన్ హెల్త్ సెంటర్ హెల్త్ విజిటర్ పుష్పలత, ఆరోగ్య కార్యకర్తలు రత్నశేఖర్, ఆలీ, వేణు, రషీద్, నవీద్, శ్రీనివాసరావు, కరిముల్లా బాషిద్, ఆశా కార్యకర్తలు, ల్యాబ్ టెక్నీషియన్లు సంధ్య, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

# గుంటూరు నగర అభివృద్ధిపై అంతర్జాతీయ వేదికలో మేయర్, కమిషనర్ చర్చలు

- ప్రపంచ మేయర్ల ఫోరమ్ రెండో రోజు సదస్సులో పట్టణ భద్రత, పర్యావరణం, రవాణాపై సమాలోచనలు

**గుంటూరు, నవంబరు 26 (జర్నలిస్ట్ ఫైల్):** పట్టణాల సమగ్ర అభివృద్ధి, ఆధునిక నగర పాలన, సుస్థిర మౌలిక సదుపాయాల కల్పనపై అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న చర్చల్లో గుంటూరు నగర మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ, నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్ పాల్గొన్నారు. ముంబైలో అఖిల భారత స్థానిక స్వపరిపాలన సంస్థ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న 3వ ప్రపంచ మేయర్ల వేదిక--2026 రెండో రోజు కార్యక్రమాల్లో వారు భాగస్వాములయ్యారు.
వివిధ దేశాల మేయర్లు, పట్టణ పాలనా ప్రతినిధులు, విధాన రూపకర్తలు, పట్టణాభివృద్ధి నిపుణులు పాల్గొన్న ఈ సదస్సులో నగరాల భద్రత, ప్రజలకు అనుకూలమైన రవాణా వ్యవస్థలు, ఆధునిక మౌలిక సదుపాయాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.




నగరాల్లో భద్రతా ప్రమాణాలను మెరుగుపరచడం, ప్రజా రవాణాను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడం, నికర-శూన్య ఉద్గారాల లక్ష్యంతో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, వాతావరణ మార్పుల ప్రభావాలను ఎదుర్కొనే పట్టణ విధానాల రూపకల్పనపై సాంకేతిక సమావేశాలు నిర్వహించారు. నదీ ఆధారిత పట్టణాభివృద్ధి, ఇంధన పరివర్తన, క్రీడలు, ఆరోగ్యకరమైన పట్టణ జీవనానికి అవసరమైన సదుపాయాల కల్పనపై కూడా చర్చలు జరిగాయి.
ఈ అంతర్జాతీయ వేదిక ద్వారా వివిధ నగరాలు అమలు చేస్తున్న అభివృద్ధి విధానాలు, పాలనా నమూనాలు, పర్యావరణహిత ప్రణాళికలను తెలుసుకునే అవకాశం లభించింది. గుంటూరు నగర అభివృద్ధికి ఉపయోగపడే ఆధునిక ఆలోచనలు, ఉత్తమ విధానాలపై మేయర్, కమిషనర్ ఇతర దేశాల ప్రతినిధులతో తమ అభిప్రాయాలను పంచుకున్నారు.
అంతర్జాతీయ అనుభవాలు, సాంకేతిక పరిజ్ఞానం, వినూత్న పట్టణ పాలనా విధానాలను స్థానిక అవసరాలకు అనుగుణంగా వినియోగించడం ద్వారా గుంటూరును మరింత ఆధునిక, సుస్థిర, ప్రజాకేంద్రిత నగరంగా తీర్చిదిద్దేందుకు ఈ సదస్సు ఉపయోగపడనుంది.

# ఘనంగా రాజ్యాంగ దినోత్సవం




**గుంటూరు, నవంబరు 26 (జర్నలిస్ట్ ఫైల్):** భారత రాజ్యాంగ దినోత్సవాన్ని గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సి. యం. సాయికాంత్ వర్మ భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డా. బి.ఆర్. అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. భారత రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞను చేశారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో రాజ్యాంగ దినోత్సవ దినోత్సవం ఎంతో విశిష్టమైనదన్నారు. దేశప్రజలకు ప్రజాస్వామ్య, లౌకిక, సామ్యవాద, గణతంత్ర పాలనా విలువలను అందించిన భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగ పరిషత్ ఆమోదించిన రోజు అన్నారు. దాదాపు 2 సంవత్సరాల 11 నెలల 18 రోజుల పాటు విస్తృత చర్చలు, సమీక్షల అనంతరం భారత రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26వ తేదీన రాజ్యాంగ పరిషత్ ఆమోదించిందన్నారు. 1949 నవంబర్ 26న ఆమోదించబడిన రాజ్యాంగం 1950 జనవరి 26వ తేదీ నుంచి అమలులోకి వచ్చిన సంగతిని గుర్తు చేశారు. భారత రాజ్యాంగం దేశ పౌరులకు అనేక హక్కులను కల్పించడంతో పాటు బాధ్యతలను కూడా నిర్దేశించిందన్నారు. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే నాలుగు ప్రధాన విలువలు భారత రాజ్యాంగానికి పునాదులన్నారు.
కుల, మత, ప్రాంత, భాషా భేదాలకు అతీతంగా ప్రతి పౌరుడికి సమాన గౌరవం, సమాన అవకాశాలు కల్పించడమే రాజ్యాంగ స్ఫూర్తి అని పేర్కొన్నారు. రాజ్యాంగం మనకు కల్పించిన హక్కులను తెలుసుకోవడంతో పాటు, అది నిర్దేశించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించడం ప్రతి పౌరుడి కర్తవ్యంగా భావించాలని చెప్పారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడు, ప్రతి వ్యవస్థకు చక్కని దిశా నిర్దేశం చేసిందన్నారు. ప్రతి రోజు జీవనంలో మార్గదర్శకంగా ఉంటుందని చెప్పారు. రాజ్యాంగ స్ఫూర్తితో ఉద్యోగులు పారదర్శకంగా, జవాబుదారీతనతో మంచి సేవలను ప్రజలకు అందించాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జనరల్ సర్జరీ విభాగ అభివృద్ధికి పీజీ వైద్య విద్యార్థుల విరాళం



- రూ.1.50 లక్షల విలువైన వైద్య పరికరాలు, ఇతర సామగ్రి అందజేత

**గుంటూరు, నవంబరు 26 (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలోని జనరల్ సర్జరీ విభాగ అభివృద్ధికి 2023-26 బ్యాచ్ పీజీ వైద్య విద్యార్థులు తమవంతు సహకారం అందించారు. తాము విద్యనభ్యసించిన విభాగం మరింత అభివృద్ధి చెందాలనే సంకల్పంతో సుమారు రూ. 1.50 లక్షల విలువైన వైద్య పరికరాలు, అవసరమైన ఇతర సామగ్రిని విరాళంగా అందజేశారు.
విభాగంలో వైద్య సేవలు, బోధన, పరిపాలనా అవసరాలకు ఉపయోగపడే స్కానర్, ప్రింటర్, ఏసీ యూనిట్లు, ఆపరేషన్ థియేటర్‌కు అవసరమైన పరికరాలతో పాటు ఇతర సామగ్రిని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ సమక్షంలో జనరల్ సర్జరీ విభాగానికి అందించారు.
తాము చదువుకున్న వైద్య కళాశాల, విభాగం అభివృద్ధికి తోడ్పడటం ఆనందంగా ఉందని పీజీ వైద్య విద్యార్థులు పేర్కొన్నారు. తమ విద్యాభ్యాసానికి, వైద్యనైపుణ్యాల అభివృద్ధికి సహకరించిన విభాగానికి తిరిగి సేవ చేయాలనే ఉద్దేశంతో ఈ విరాళం అందించినట్లు తెలిపారు.
విద్యార్థులు చూపిన సేవాభావం, కళాశాల అభివృద్ధిపై ఉన్న బాధ్యతాయుత దృక్పథాన్ని ఆసుపత్రి అధికారులు అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు ప్రభుత్వ వైద్య సంస్థల అభివృద్ధికి, వైద్య సేవల మెరుగుదలకు దోహదపడతాయని పేర్కొంటూ, భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలు కొనసాగాలని ఆకాంక్షించారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా? అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

### మంగళగిరిలో ఓటు హక్కు వినియోగించుకున్న

## ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



**మంగళగిరి, నవంబర్ 25(జర్నలిస్ట్ ఫైల్):** : మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గురువారం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 11.30 గంటల ప్రాంతంలో మంగళగిరిలోని శ్రీలక్ష్మీనరసింహ కాలనీలో ఉన్న 34వ నంబర్ పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు వేశారు. ఎన్నికల నిబంధనలను అనుసరిస్తూ సాధారణ ఓటర్లతో కలిసి పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమని, ప్రతి పౌరుడు బాధ్యతగా తమ ఓటును వినియోగించుకోవాలని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. అలాగే దేశ ప్రజలకు రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

## సచివాలయంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



- రాజ్యాంగ పీఠికను పఠించిన అధికారులు, ఉద్యోగులు
- రాజ్యాంగ విలువలను పరిపాలన, ప్రజాసేవలో ఆచరించాలి

**అమరావతి, నవంబర్ 26 (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో గురువారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. సచివాలయం మొదటి భవనంలోని ముఖ్యమంత్రి కార్యాలయ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు పాల్గొని భారత రాజ్యాంగ పీఠికను తెలుగులో పఠించారు.

1949 నవంబర్ 26న భారత రాజ్యాంగ సభ రాజ్యాంగాన్ని ఆమోదించింది. 1950 జనవరి 26న రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. రాజ్యాంగాన్ని ఆమోదించిన నవంబర్ 26వ తేదీని ప్రతి సంవత్సరం రాజ్యాంగ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సర్వీసెస్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. రావత్, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్. సురేశ్ కుమార్, సమాచార, ప్రజాసంబంధాల శాఖ డైరెక్టర్ కె.ఎస్. విశ్వనాధన్ పాల్గొన్నారు. వారి ఆధ్వర్యంలో సచివాలయ అధికారులు, ఉద్యోగులు రాజ్యాంగ పీఠికను పఠించారు. ఈ సందర్భంగా రాజ్యాంగం ప్రతిపాదించిన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి మౌలిక ఆదర్శాల ప్రాధాన్యతను వివరించారు. అధికారులు, ఉద్యోగులు విధుల నిర్వహణలో రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ, రాజ్యాంగం నిర్దేశించిన విలువలను ఆచరణలో పెట్టాలని సూచించారు.

ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించే సమయంలో చట్టబద్ధమైన విధానాలు, నిష్పాక్షికత, పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. పౌరుల హక్కులను పరిరక్షిస్తూ రాజ్యాంగ వ్యవస్థకు అనుగుణంగా తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని ప్రభుత్వ ఉద్యోగులకు సూచించారు. రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమం రాజ్యాంగ విలువల పట్ల అధికారుల, ఉద్యోగుల నిబద్ధతను పునరుద్ఘాటించింది. రాజ్యాంగ ఆదర్శాలను కేవలం సిద్ధాంతాలకే పరిమితం చేయకుండా పరిపాలనా నిర్ణయాల్లో, ప్రజా సేవలో ఆచరణాత్మకంగా అమలు చేయాల్సిన అవసరాన్ని ఈ కార్యక్రమం గుర్తు చేసింది. ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ విభాగం సంయుక్త కార్యదర్శి రామసుబ్బయ్యతో పాటు సాధారణ పరిపాలన శాఖ, ఇతర శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## నర్సింగ్ విద్యార్థులకు పాలియేటివ్ కేర్‌పై ప్రత్యేక శిక్షణ



- రోగులకు గౌరవప్రదమైన సేవలు, నొప్పి ఉపశమనంపై అవగాహన

**గుంటూరు, నవంబరు 26 (జర్నలిస్ట్ ఫైల్):** నర్సింగ్ విద్యార్థులకు పాలియేటివ్ కేర్ (ఉపశమన వైద్యం)పై అవగాహన కల్పించి, రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. "బెటర్ కేర్ -- గ్రేటర్ కంఫర్ట్ విత్ డిగ్నిటీ" అనే నినాదంతో గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆసుపత్రిలోని ఎంసీహెచ్ బ్లాక్‌లో ఈ శిక్షణ కొనసాగుతోంది.

ఈ కార్యక్రమంలో నర్సింగ్ విద్యార్థులకు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఉపశమనం కల్పించే విధానాలు, నొప్పి నివారణ, శారీరక, మానసిక బాధలను తగ్గించే చర్యలు, రోగులకు ఆత్మీయంగా అండగా నిలవడం, గౌరవప్రదమైన వైద్య సేవలు అందించడం వంటి అంశాలపై నిపుణులు శిక్షణ అందిస్తున్నారు.

వ్యాధితో బాధపడుతున్న రోగుల నొప్పులు, ఇతర అసౌకర్యాలను తగ్గించి వారి జీవన నాణ్యతను మెరుగుపరచడంలో పాలియేటివ్ కేర్ కీలక పాత్ర పోషిస్తుందని కార్యక్రమంలో వివరించారు. రోగులకు వైద్య చికిత్సతో పాటు మానసిక ధైర్యం, భావోద్వేగ పరమైన తోడ్పాటు అందించడం కూడా నర్సింగ్ సేవల్లో ముఖ్యమైన భాగమని తెలియజేస్తున్నారు.

భవిష్యత్తులో నర్సింగ్ విద్యార్థులు వృత్తిపరమైన నైపుణ్యాలతో పాటు మానవీయ విలువలకు ప్రాధాన్యతనిస్తూ సమర్థవంతమైన వైద్య సేవలు అందించేందుకు ఈ శిక్షణ కార్యక్రమం దోహదపడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

## ఓటు హక్కును ప్రతి ఒక్కరూ బాధ్యతగా వినియోగించుకోవాలి

- మంత్రి కందుల దుర్గేష్
- గోదావరి పుష్కరాల నాటికి రాజమహేంద్రవరాన్ని మహానగరంగా తీర్చిదిద్దుతాం



**రాజమహేంద్రవరం, నవంబర్ 26 (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైన రాజ్యాంగ హక్కని, ప్రతి పౌరుడు బాధ్యతగా దానిని వినియోగించుకోవాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో గురువారం నగరంలోని 44వ వార్డులో శ్యామలాంబ మోడల్ స్పెషల్ మున్సిపల్ కార్పొరేషన్ అప్పర్ ప్రైమరీ స్కూల్ పోలింగ్ కేంద్రంలో ఆయన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 44వ వార్డులో కూటమి అభ్యర్థిగా కంటిపూడి రాజేంద్ర ప్రసాద్ పోటీ చేస్తున్నారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొంటుండటం ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమతుల్యంగా అమలు చేస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తోందని అన్నారు.

రాజమహేంద్రవరం నగర భవిష్యత్తు అభివృద్ధిపై మాట్లాడుతూ, గతంలో 50 వార్డుల పరిధిలో ఉన్న నగరం ప్రస్తుతం 72 వార్డులకు విస్తరించిందని, ఈ విస్తరణకు అనుగుణంగా నగరాన్ని మహానగర స్థాయిలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే గోదావరి పుష్కరాల నాటికి రాజమహేంద్రవరాన్ని మరింత సుందరంగా, ఆధునిక సౌకర్యాలతో కూడిన నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. నగర సమగ్రాభివృద్ధికి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. మేయర్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రేలంగి శ్రీదేవికి కమలం గుర్తుపై ఓటు వేయాలని, ఆయా వార్డుల్లో కూటమి అభ్యర్థులకు గాజు గ్లాసు, కమలం, సైకిల్ గుర్తులపై ఓటు వేసి నగర అభివృద్ధికి తోడ్పడాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

## జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు ఏపీ ఎన్జీజీఓ సంఘం అభినందనలు

- క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం విజయవంతం..



**గుంటూరు, నవంబరు 26 (జర్నలిస్ట్ ఫైల్):** క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గా ప్రసాద్‌ను ఏపీ ఎన్జీజీఓ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. వైద్య కార్యక్రమం నిర్వహణలో అందించిన సహకారం, చొరవకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజారోగ్య పరిరక్షణకు క్యాన్సర్ స్క్రీనింగ్ వంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ముందస్తు పరీక్షల ద్వారా వ్యాధులను గుర్తించి తగిన చికిత్స అందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావడంలో ఆసుపత్రి యాజమాన్యం, వైద్య సిబ్బంది అందించిన సహకారం అభినందనీయమన్నారు. భవిష్యత్తులోనూ ప్రజలకు ఉపయోగపడే ఆరోగ్య, వైద్య కార్యక్రమాలను మరిన్ని నిర్వహించేందుకు సహకరించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో గుంటూరు మెడికల్ కాలేజీ అసోసియేట్ ప్రొఫెసర్, రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ బి. అనిల్ కుమార్, జిల్లా అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ ఘంటసాల శ్రీనివారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షరీఫ్, జిల్లా అధ్యక్షుడు కళ్యాణ్ కుమార్, కార్యదర్శి కోటేశ్వరరావు, శ్యామ్ కుమార్, ఎన్జీజీఓ సంఘం జిల్లా వైస్ చైర్‌పర్సన్ వెల్లంపల్లి పద్మజ, తాజున్నిసా పాల్గొన్నారు.

## కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న మంత్రి లోకేష్



**ఉండవల్లి, నవంబర్ 25(జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కుటుంబ సభ్యులతో కలిసి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. గురువారం ఉదయం ఉండవల్లిలోని గాదె రామయ్య సీతారామమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కుటుంబ సభ్యులతో కలిసి చేరుకున్న మంత్రి లోకేష్... 53వ డివిజన్ పోలింగ్ కేంద్రంలో సీఎం చంద్రబాబు నాయుడు, భువనేశ్వరి, తన సతీమణి నారా బ్రాహ్మణితో కలిసి ఓటు వేశారు.

## యూపీఎస్సీ ఇంటర్వ్యూకు ఎంపికైన అభ్యర్థులకు ఉచిత మాక్ ఇంటర్వ్యూలు

**విజయవాడ, నవంబర్ 25(జర్నలిస్ట్ ఫైల్):** యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ మెయిన్స్ పరీక్ష-2026లో అర్హత సాధించి పర్సనాలిటీ టెస్ట్ (ఇంటర్వ్యూ)కు ఎంపికైన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల అభ్యర్థులకు ఉచిత మాక్ ఇంటర్వ్యూలు, వ్యక్తిత్వ వికాస కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డా. బి.ఆర్. అంబేద్కర్ స్టడీ సర్కిల్ కార్యదర్శి, సంచాలకులు ఎన్. మోహన రావు తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 21 నుంచి 30 వరకు నిర్వహించిన సివిల్ సర్వీసెస్ మెయిన్స్ పరీక్షలో అర్హత సాధించి తదుపరి దశకు ఎంపికైన అభ్యర్థులకు ఇంటర్వ్యూలో మెరుగైన ప్రతిభ కనబరిచేందుకు అవసరమైన మార్గదర్శకత్వం, శిక్షణ, సహాయ సహకారాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్తలు, ప్రస్తుత, పదవీ విరమణ చేసిన సివిల్ సర్వెంట్లు, వివిధ రంగాల నిపుణులు, అనుభవజ్ఞులైన వృత్తి నిపుణులతో మాక్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఇంటర్వ్యూ విధానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, సమకాలీన అంశాలు, వ్యక్తిత్వ మదింపు తదితర అంశాలపై అభ్యర్థులకు సమగ్ర అవగాహన కల్పించనున్నారు. అభ్యర్థుల ప్రతిభ, లోపాలను విశ్లేషిస్తూ వ్యక్తిగత అభిప్రాయాలు, సూచనలు, సలహాలు అందించడంతో పాటు, అనలైన యూపీఎస్సీ పర్సనాలిటీ టెస్ట్‌ను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొనేందుకు వ్యక్తిగత మెంటరింగ్ కూడా అందించనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు డా. బి.ఆర్. అంబేద్కర్ స్టడీ సర్కిల్ అధికారిక వెబ్‌సైట్ https://apstudycircle.apcfss.in/ ద్వారా మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల నమోదుకు డిసెంబర్ 4వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉందని ఎన్. మోహన రావు తెలిపారు.

# రాజ్యాంగ విలువలను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత

- రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్




**రాజమహేంద్రవరం, నవంబరు 26 (జర్నలిస్ట్ ఫైల్):** రాజ్యాంగం కల్పించిన హక్కులు, స్వేచ్ఛతోనే ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతమవుతోందని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ అన్నారు. గురువారం నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు,ఎంపీ శ్రీమతి దగ్గుబాటి పురంధేశ్వరి, జిల్లా అధ్యక్షుడు విక్కీనాగేంద్ర, తదితరులకు, సభకు హాజరైన వారికి రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

నేడు దేశ ప్రజలు అనుభవిస్తున్న స్వేచ్ఛ, సమానత్వం, హక్కులన్నీ రాజ్యాంగం కల్పించినవేనని పేర్కొన్నారు. రాజ్యాంగ రూపకల్పనలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కీలక పాత్ర పోషించారని, ఆయనతో పాటు పలువురు మేధావులు, న్యాయ నిపుణులు విశేషంగా కృషి చేశారని గుర్తు చేశారు. స్వాతంత్ర్యానికి ముందే రాజ్యాంగ పరిషత్ ఏర్పాటైందని, దేశ విభజన అనంతరం 299 మంది సభ్యులతో కొనసాగిన పరిషత్ దాదాపు మూడేళ్లపాటు చర్చించి రాజ్యాంగాన్ని రూపొందించిందని వివరించారు. ఏడుగురు సభ్యులతో ఏర్పాటైన ముసాయిదా కమిటీకి అంబేద్కర్ అధ్యక్షత వహించారని తెలిపారు.

**మహిళలకు తొలి నుంచే సమాన హక్కులు :** రాజ్యాంగ పరిషత్‌లో 15 మంది మహిళలు సభ్యులుగా ఉండటం విశేషమని మాధవ్ పేర్కొన్నారు. వారిలో మన ప్రాంతానికి చెందిన దుర్గాబాయి దేశ్‌ముఖ్‌తో పాటు సరోజిని నాయుడు, సుచేతా కృపలానీ వంటి ప్రముఖులు ఉన్నారని చెప్పారు. అనేక దేశాల్లో మహిళలు ఓటు హక్కు కోసం సుదీర్ఘ పోరాటాలు చేయాల్సి వచ్చిందని, భారతదేశం మాత్రం తొలి సాధారణ ఎన్నికల నుంచే మహిళలకు, పురుషులకు సమాన ఓటు హక్కు కల్పించిందని వివరించారు.

**భారతీయ సంస్కృతికి ప్రతిబింబం :** ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగంగా భారత రాజ్యాంగానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు.

వివిధ దేశాల రాజ్యాంగాల్లోని ఉత్తమ అంశాలను స్వీకరించి, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, వైవిధ్యానికి అనుగుణంగా రూపొందించారని తెలిపారు. 'ఆనో భద్రాః క్రతవో యంతు విశ్వతః' అనే ఋగ్వేద సూక్తి స్ఫూర్తితో అన్ని వైపుల నుంచి మంచి ఆలోచనలను స్వీకరించామన్నారు.

రాజ్యాంగ అసలు ప్రతులను ముద్రించకుండా శాంతినికేతన్‌కు చెందిన నందలాల్ బోస్ నేతృత్వంలోని కళాకారుల బృందం చేతితో రాయడం విశేషమని చెప్పారు. భారతీయ చరిత్ర, సంస్కృతి, నాగరికతను ప్రతిబింబించే చిత్రాలను అందులో పొందుపరిచారని తెలిపారు. సింధు లోయ నాగరికత, రామాయణం, మహాభారతం, గౌతమ బుద్ధుడు, విక్రమాదిత్యుడు, కనిష్కుడు, స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రకు సంబంధించిన చిత్రాలు రాజ్యాంగానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని పేర్కొన్నారు.

**హక్కులతో పాటు బాధ్యతలూ ముఖ్యం :** 1949 నవంబరు 26న రాజ్యాంగాన్ని ఆమోదించగా, 1950 జనవరి 26 నుంచి అమల్లోకి వచ్చిందని మాధవ్ గుర్తు చేశారు. అసలు రాజ్యాంగ ప్రతులను పార్లమెంటులో ప్రత్యేక నైట్రోజన్ వాతావరణంలో భద్రపరిచారని తెలిపారు.

రాజ్యాంగం పౌరులకు హక్కులు కల్పించడంతో పాటు బాధ్యతలను కూడా నిర్దేశించిందన్నారు. దేశ సమగ్రత, ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, సమానత్వం, సోదరభావాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో 2015 నుంచి నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. రాజ్యాంగ నిర్మాతల ఆశయాలకు అనుగుణంగా దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# మహిళల గౌరవ పరిరక్షణకు సమష్టి కార్యాచరణ అవసరం

- రాజకీయ ప్రయోజనాల కోసం మీడియా వినియోగం, మహిళలపై అభ్యంతరకర ప్రచారాలపై రౌండ్ టేబుల్ సమావేశంలో ఆందోళన





**విజయవాడ, నవంబరు 26 (జర్నలిస్ట్ ఫైల్):** రాజకీయ పార్టీలు, రాజకీయ శక్తులు మీడియా సంస్థలను తమ ప్రయోజనాలకు వినియోగించుకోవడం, మహిళల వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించేలా కథనాలు, టీవీ చర్చలు నిర్వహించడం ప్రజాస్వామ్యానికి సవాలుగా మారుతోందని పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. మీడియా యాజమాన్యాల్లో పారదర్శకత, బాధ్యతాయుత జర్నలిజం, మహిళల గౌరవ పరిరక్షణకు సమష్టి కార్యాచరణ అవసరమని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సి.ఆర్. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో విజయవాడలోని ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ కాన్ఫరెన్స్ హాల్‌లో 'మీడియా యాజమాన్యాలు, ప్రయోజనాల వైరుధ్యం మరియు పర్యవసానాలు' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సమాచార, పౌర సంబంధాలు, గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

మంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా మీడియా సామాజిక బాధ్యతతో వ్యవహరించి సమాజంలో సానుకూల మార్పులకు దోహదపడాలని అన్నారు. మారుతున్న మీడియా పరిస్థితులకు అనుగుణంగా ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను పునర్వ్యవస్థీకరించి సమర్థవంతమైన నియమ నిబంధనలు రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయ ప్రత్యర్థులను శత్రువులుగా చూడకుండా పరస్పర గౌరవంతో వ్యవహరించాలని, మహిళలను కించపరిచే భాష, వ్యక్తిగత దూషణలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ మాట్లాడుతూ రాజకీయ, వ్యాపార ప్రయోజనాలతో మీడియా యాజమాన్యాలు ముడిపడినప్పుడు ప్రజాభిప్రాయంపై ప్రభావం పడే అవకాశముందని, యాజమాన్య సంబంధాలు, ప్రయోజనాల వైరుధ్యాలను వెల్లడించే పారదర్శక వ్యవస్థ అవసరమని సూచించారు.

రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ పోతుల బాలకోటయ్య, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ మాట్లాడుతూ మహిళలు, రాజకీయ ప్రత్యర్థుల కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరకర ప్రచారం చేయడం, వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించడం ఆందోళనకరమన్నారు. వాక్ స్వాతంత్ర్యాన్ని బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని, సెన్సేషన్ కోసం వ్యక్తిగత విమర్శలు, దుష్ప్రచారాలకు పాల్పడకూడదని సూచించారు. మీడియా యాజమాన్యాల పారదర్శకత, మహిళల గౌరవ పరిరక్షణ, మీడియా నైతిక విలువలపై విద్యార్థులు, యువతలో అవగాహన పెంపొందించేందుకు కార్యక్రమాలు చేపట్టాలని అభిప్రాయపడ్డారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, హైకోర్టు సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ ప్రతినిధి కొలనుకొండ శివాజీ, బీజేపీ నాయకుడు పాటూరి నాగభూషణం కూడా మీడియా స్వతంత్రత, వాస్తవ నిర్ధారణ, బాధ్యతాయుత వార్తా ప్రసారం, రాజకీయ ప్రభావాల నియంత్రణపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సీనియర్ జర్నలిస్ట్ వడ్లమూడి పద్మావతి మాట్లాడుతూ మీడియా స్వేచ్ఛతో పాటు నైతిక బాధ్యతలు కూడా కీలకమని, వార్తలకు వ్యాఖ్యానాలకు మధ్య స్పష్టమైన విభజన ఉండాలని పేర్కొన్నారు.

రాజకీయ ప్రయోజనాల కోసం మీడియా వినియోగం, మహిళలపై ఆన్‌లైన్ వేధింపులు, వ్యక్తిత్వ హననాన్ని రాజకీయాలకు అతీతంగా ఖండించాలని సూచించారు. మీడియా స్వీయ నియంత్రణ మార్గదర్శకాలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలు, వాస్తవ నిర్ధారణ విధానాలు బలోపేతం కావాలని, ప్రజల్లో మీడియా అవగాహన పెంచేందుకు జిల్లా స్థాయిలో చర్చా వేదికలు నిర్వహించాలని అభిప్రాయపడ్డారు. మీడియా స్వేచ్ఛ, పారదర్శకత, సామాజిక బాధ్యత, మహిళల గౌరవ పరిరక్షణ కోసం పౌర సమాజం, మేధావులు, మీడియా సంస్థలు సమష్టిగా కృషి చేయాలని సమావేశంలో పలువురు వక్తలు పిలుపునిచ్చారు.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com